ప్రజాశక్తి

శనివారం 26 నవంబర్ 2022 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

ఎన్ఇపితో అంగన్‌వాడీలు కనుమరుగు



జెండాను ఆవిష్కరిస్తున్న యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బేబిరాణి, అభివాదం చేస్తున్న ప్రతినిధులు

ప్రజాశక్తి - గుంటూరు

కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా తెచ్చిన నూతన విద్యా విధానం(ఎన్ఇపి)తో అంగన్‌వాడీ కేంద్రాల మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. అంగన్‌వాడీ సెంటర్లలో ప్రీ ప్రైమరీ విద్యను విలీనం చేయటం వల్ల వాటి లక్ష్యం దెబ్బతింటుందని చెప్పారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర 10వ మహాసభ గుంటూరు రెవెన్యూ కళ్యాణ మండపంలో (రంజనా నిరుల నగర్‌లో) శుక్రవారం ప్రారంభమైంది. మహాసభ ఆహ్వాన సంఘం అధ్యక్షులుగా కెఎస్ లక్ష్మణరావు ప్రారంభ ఉపన్యాసం చేశారు. పౌష్టికాహారాన్ని అందించటం, రక్తహీనత అరికట్టాలనే బృహత్తర లక్ష్యంతో 1975లో ఏర్పడిన ఐసిడిఎస్ వ్యవస్థ ఎన్ఇపి వల్ల అదృశ్యమయ్యే ప్రమాదం ఏర్పడిందని, అంగన్‌వాడీలు, ప్రీ ప్రైమరీ పాఠశాలలు రెండు వేర్వేరుగానే ఉండాలని స్పష్టం చేశారు. 25 ఏళ్లకుపైగా సర్వీసు ఉన్న వర్కర్లకూ రూ.11500లు, హెల్పర్‌కు రూ.7 వేలు మాత్రమే ఇస్తున్నారని, కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బిల్లులు సకాలంలో రాకపోవటంలో సెంటర్ల నిర్వహణ భారంగా మారిందన్నారు. ఈ నేపథ్యంలో అంగన్‌వాడీల డిమాండ్లపై జరిగే ఆందోళనలకు పిడిఎఫ్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఉద్ఘాటించారు.



ప్రారంభ సభలో మాట్లాడుతున్న కెఎస్ లక్ష్మణరావు

యూనియన్ జాతీయ కార్యదర్శి కె.వరలక్ష్మి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల ఐసిడిఎస్ వ్యవస్థ ప్రమాదంలో ఉందని, ప్రభుత్వాలు క్రమంగా తమ బాధ్యత నుండి తప్పుకుంటున్నాయని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఐసిడిఎస్‌కు కేంద్రం బడ్జెట్ పెంచట్లేదన్నారు. గతంలో 90 శాతంగా ఉన్న కేంద్రం వాటా క్రమంగా తగ్గిస్తూ ఇప్పుడు 60 శాతానికి వచ్చిందని తెలిపారు. ఆకలి సూచిలో భారత దేశం 107వ స్థానంలో ఉంటే అమృత కాలం ఎక్కడ ▶ 2లో



అధికారులు సీజ్ చేసిన నూనెలు

రూ.1.70 లక్షల నకిలీ నూనె

నరసరావుపేటలోని మిల్లులో గుర్తించిన అధికారులు

ప్రజాశక్తి - నరసరావుపేట

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావు పేటలో పలు నూనె మిల్లుల్లో ఆహార భద్రతా అధికారులు అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ గౌస్ మోహిద్దీన్ ఆధ్వర్యంలో శుక్రవారం తనిఖీలు చేపట్టారు. సత్తెనపల్లి రోడ్డులోని వెంకట సాయిదుర్గ మిల్లులో రూ.1.70 లక్షల నకిలీ ఫ్రీ లైట్ సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్లను సీజ్ చేశారు. ఇక్కడ నిబంధనలకు విరుద్ధంగా నూనె తయారీని అధికారులు గుర్తించారు. మరికొన్ని ఇతర మిల్లుల్లోనూ నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా గౌస్ మోహిద్దీన్ మాట్లాడుతూ నూనె మిల్లుల్లో తరచూ తనిఖీలు చేస్తామని అక్రమాలు తేలితే మిల్లులు సీజ్ చేస్తామని హెచ్చరించారు. నకిలీ నూనె తయారు చేసిన వెంకట సాయిదుర్గ మిల్లుపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. తనిఖీల్లో పల్నాడు జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, సుందరరామిరెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మద్దతు ధరల కోసం నేడు ధర్నా

జయప్రదం చేయాలని రైతు సంఘం నాయకుల పిలుపు - విస్తృత ప్రచారం 5 లో



రెండోరోజూ ఉత్సాహంగా కళాకారుల ప్రదర్శనలు

మరోసారి నృత్యంతో సందడి చేసిన మంత్రి రోజా 5 లో

రూ. కోట్లు వెచ్చించినా నీటి ఇక్కట్లే!

- గుంటూరులో పాక్షిక నీటి సరఫరా
- లక్ష్మీపురం రిజర్వాయర్ పరిధిలో రెండ్రోజులుగా నిలిపివేత
- ప్రజలకు కనీస సమాచారం ఇవ్వని అధికారులు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరులో 2013లో రూ.460 కోట్లతో రక్షిత మంచినీటి పథకం నిర్మాణం చేపట్టినా ఇప్పటికి తాగునీటి సరఫరా మెరుగుపడటం లేదు. నిత్యం ఏదోఒక ప్రాంతంలో తాగునీటి సమస్య వెంటాడుతూనే ఉంది. మూణ్ణెల్లకోసారి మరమ్మతుల పేరుతో అధికారికంగా నీటి సరఫరా నిలిపివేస్తుంటారు. కృష్ణా నదిలో లక్షల క్యూసెక్కుల నీరు వృధాగా సముద్రంలోకి పోతున్నా గుంటూరు నగరంలోని పలు రిజర్వాయర్లకు నీరు పూర్తి స్థాయిలో నిండడం లేదు.

గుంటూరులో రెండ్రోజులుగా పలు ప్రాంతాల్లో నీటి సరఫరా నిలిచింది. విద్యుత్ సమస్య కారణంగా పలు రిజర్వాయర్లకు నీటి సరఫరా జరగక మొత్తం ఖాళీ కావడంతో కుళాయిలకు నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. ప్రధానంగా లక్ష్మీపురం రిజర్వాయర్ పరిధిలో గురు, శుక్రవారాల్లో నీరు సరఫరా చేయలేదు. అయితే ఈ సమాచారం ప్రజలకు ముందస్తుగానూ ఇవ్వలేదు. ఉండవల్లి నుంచి తక్కెళ్లపాడుకు నీటి సరఫరాలోనే సమస్యలు ఏర్పడ్డాయని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. ఈ అంశంపై ▶ 2లో



4 లో

సమ సమాజ స్థాపనకు చాపకూడు



ఎరుకలపూడిలో కోతకు సిద్ధమైన వరి పంట

2 లో

పంట చేతికొచ్చే వేళ తంటా..

వాతావరణంలో మార్పులు - రైతు గుండెల్లో గుబులు

మిర్చిపై వెంటాడుతున్న తామర

బొబ్బర, తెల్లదోమ ప్రభావంతో రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి



తెగుళ్ల నేపథ్యంలో తాడికొండ మండలంలో మిర్చిపైరును పరిశీలిస్తున్న అధికారులు

మిర్చి పైరుమీద తెగుళ్ల దాడి పెరిగింది. నల్ల తామర పురుగు, జెమిని వైరస్ (బొబ్బర) ఉధృతం అవుతోంది. పల్నాడు, గుంటూరు జిల్లాలోని వివిధ మండలాల్లో తామర తెగులు గత నెలలోనే స్వల్పంగా ప్రారంభం కాగా ఇటీవల వరసగా ఎక్కువ రోజులు ఆకాశం మేఘావృత్తంగా ఉండటం, ముసురు ప్రభావం ఎక్కువగా ఉండటం వల్ల తెగుళ్ల బెడద మరింత పెరుగుతుందని రైతులు గుర్తించారు. ప్రధానంగా పల్నాడు జిల్లాలోని మాచర్ల, గురజాల, సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లో ఈ ప్రభావం ఎక్కువగా ఉంటోంది. తామర పురుగులను ఉద్యాన శాఖ అధికారులు గుర్తించారు. బొబ్బర తెగులు ప్రభావంతో ఆకు ముడత వస్తోంది. కొన్ని ప్రాంతాల్లో తెల్లదోమ ఎక్కువగా ▶ 2లో



నాగిరెడ్డిపాలెంలో పంట కోత ప్రయోగం

ప్రజాశక్తి - బెల్లంకొండ

బెల్లంకొండ మండలం నాగిరెడ్డిపాలెంలో బూతుకూరి వెంకటేశ్వరరెడ్డి వరి పొలంలో ప్రధాన మంత్రి పంటల బీమా పథకం కింద పంట దిగుబడి అంచనా నిమి త్తం కె. ముక్తే శ్వరరావు డి డి - సిపిఒ - పల్నాడు కార్యాలయం పర్య వేక్ష ణలో పంట కోత ప్రయోగం చేశారు. 5X5 మీటర్ల విస్తీ ర్ణంలో 15.81 కిలో గ్రాములు ధాన్యం దిగుబడి వచ్చింది. సగటున ఎకరాకు 30 బస్తాలు (ఒక్కొక్కటి 75 కె జి లు) దిగుబడి వస్తున్నట్లు అంచనా వేశారు. కార్యక్రమంలో ఎం.అంజలి, సహాయ గణాంకాధికారి,డి. క్రిష్ణయ్య, వ్యవ సాయాధికారి, టి.వంశీకృష్ణ, ఎస్‌బిఐ జనరల్ ఇన్సూరెన్సు కం పెనీ, గ్రామ రెవెన్యూ అధికారులు వెంకయ్య, గురవయ్య, గ్రామ వ్యవసాయ సహాయకులు అయ్యప్ప,శ్యామ్‌ప్రకాష్, రైతులు బి.వెంకటేశ్వరరెడ్డి, శ్యాం సుందర్ పాల్గొన్నారు.



బూత్ లెవెల్ ఆఫీసర్లతో సమావేశంలో ఆర్‌డీవో ఆదెయ్య

ఆధార్‌కు ఓటర్‌కార్డు నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి- పిడుగురాళ్ల

స్థానిక ఆర్‌అండ్‌బి బంగ్లాలో బూత్ లెవెల్ ఆఫీసర్లతో గురజాల ఆర్‌డీవో ఆదెయ్య శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధా ర్‌కు తప్పనిసరిగా ఓటర్‌కార్డు నమోదు చేయించాలన్నారు. ఆధార్ ద్వారా రెండు ఓట్లు ఉన్న వారిలో ఏ అడ్రస్ ఉందో ఆ అడ్రస్‌ను ఆధార్ ద్వారా తీసుకొని రెండో ఓటుకార్డును తొల గించే లా చర్యలు తీసుకోవాలన్నారు. మీ పరిధిలో ఉన్న ప్రతి ఓటర్ కార్డు తప్పనిసరిగా ఆధార్‌కు అనుసంధానమయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో తహశీల్దార్ చక్రవర్తి, బూత్ లెవల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.



బీమా సుగం పోర్టల్‌ను విరమించుకోండి

ప్రజాశక్తి - వినుకొండ

ఇన్సూరెన్స్ రంగంలో ఐఆర్డిఎఐ ప్రవేశ పెట్టిన బీమా సుగం పోర్టల్‌ను విరమించుకోవాలని ఎల్‌ఐసి ఏజంట్స్ ఆర్గ నైజేషన్ ఆఫ్ ఇండియా(ఎల్‌ఐసిఎఒఐ) యూనియన్ నాయ కులు డిమాండ్ చేశారు. వినుకొండ బ్రాంచి కార్యదర్శి బొం కూరి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా పలువురు ప్రసంగిస్తూ బీమా సుగం వల్ల ఎల్‌ఐసిలో ఏజెంట్ల వ్యవస్థ దెబ్బ తిం టుం దన్నారు. పాలసీలపై జిఎస్టిని తీసివేయాలని, బోనస్ పెం చాలని, డైరెక్ట్ మార్కెటింగ్ ను నిలిపివేయాలని, ఈ ఇన్సూ రెన్స్ విధానాన్ని విరమించుకోవాలని కోరుతూ డిశంబరు 9 న హైదరాబాద్‌లోని ఐఆర్‌డిఎఐ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం జరుగుతుందన్నారు. ధర్నాలో అధిక సంఖ్యలో ఏజంట్లు పాల్గొని విజయవంతం చేయాలని పిలుప నిచ్చారు. సమావేశంలో ఎస్.కోటేశ్వరరావు, వి.శ్రీనివాస రావు,జి.నవీన్ కుమార్, జి. సీతారామయ్య, ఎ.ఐరామూర్తి, వై.చంద్రశేఖర్,పి.మస్తాన్‌రెడ్డి, పి.బ్రహ్మయ్య లు పాల్గొన్నారు.

పంట చేతికొచ్చే వేళ తంటా..

ప్రజాశక్తి-తెనాలి

ఆరుగాలం శ్రమించిన రైతులు వాతావరణం మార్పులతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. తెనాలి పరిసర ప్రాంతాల్లో వరి కోతకు సిద్ధమైంది. కొలకలూరులో శుక్రవారం ఉదయం యంత్రం సాయంతో వరి పంటను కోశారు. కొద్ది సేపటికే ఆకాశం మేఘావృతమై సన్నగా చినుకులు పడ్డాయి. దీంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. వాస్తవానికి కొలకలూరు ఖాజీపేట, ఎరుకలపూడి, కఠెవరం ప్రాంతాల్లో వరి పంట దాదాపు 70 శాతం కోతకు సిద్ధమైంది. అయితే పొలాల్లో నీరు నిలిచి ఉండి బయటకు పోయే మార్గం లేదు. పంట కాల్వల్లోనూ నీరు పుష్కలంగా ఉంది. దీంతో ఓ వైపు కోతకొచ్చిన పంట, మరోవైపు పొలంలో నీరు బయటకు వెళ్లక రైతులు తంటాలు పడుతున్నారు. ఇది చాలదన్నట్లు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో వారం రోజులుగా వాతావరణంలో మార్పులున్నాయి. ఎండ రావటం, కొద్ది క్షణాల్లోనే మబ్బులతో ఆకాశం మేఘావృతం అవుతోంది. పంట చేతికొచ్చే సమయంలో వాతావరణం ప్రతి కూలంగా మారుతుండటంతో రైతులు తీవ్రమైన ఆందోళనలో ఉన్నారు.



కొలకలూరులో కోసిన వరి పంట

ఎన్ఇపితో అంగన్‌వాడీలు కనుమరుగు

(మొదటి పేజీ తరువాయి)

వచ్చిందని ప్రశ్నించారు. మోడీ ప్రభుత్వంలో అంబాని, అదానీలకు అమృతకాలం వచ్చిందన్నారు. పిల్లల్లో, స్త్రీలలో రక్తహీనత అరికట్టటం, పౌష్టికాహారాన్ని అందించటం సేవ కాదని, ప్రభుత్వ బాధ్యతని, ఆ బాధ్యతను నెరవేర్చటంలో అంగన్‌వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. అంతటి గురుతర బాధ్యత నెరవేరుస్తున్న అంగన్‌వాడీల పట్ల పాలకులు చిన్నచూపు తగదన్నారు.

ఐద్వా జాతీయ ట్రెజరర్ ఎస్.పుణ్యవతి సౌహార్ధ సందేశమిస్తూ అంగన్‌వాడీలు వృత్తి పరమైన అంశాలతోపాటు, సమాజంలో జరిగే పరిణామాలపై నిరంతరం చైతన్యవంతంగా ఉండాలన్నారు. ముఖ్యంగా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, దాడులు, మద్యం తదితర సమస్యలపై అవగాహన కల్పించాలన్నారు. దేశంలో 70 శాతం మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారని, రోజుకు కనీసం రూ.75ల ఆదాయం కూడా లేని వారు వంద కోట్ల మంది ఉన్నారని తెలిపారు. ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.శ్రీనివాసకుమారి సౌహార్ధ సందేశం ఇస్తూ అంగన్‌వాడీ కేంద్రాల పట్ల, అంగన్‌వాడీల పట్ల కొంతమందిలో చిన్న చూపు ఉందని, అటువంటి వారికి అంగన్‌వాడీ కేంద్రాల ప్రాధాన్యతను తెలియజేయాల్సిన అవసరం ఉందని అన్నారు. హక్కుల కోసం సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అంగన్‌వాడీల పోరాటానికి ఐద్వా అండగా నిలుస్తుందన్నారు. శ్రామిక మహిళా సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ కె.ధనలక్ష్మి సౌహార్ధ సందేశమిస్తూ రాబోయే కాలంలో హక్కుల సాధనలో ఆదర్శవంతమైన ఉద్యమాలు నిర్మించాలని, కార్మికుల్ని, ఉద్యోగులు, స్కీమ్ వర్కర్లందర్ని కలుపుకొని పోరాడాలని అన్నారు. స్కీమ్‌లను మరింత బలోపేతం చేస్తూ, ప్రజలకు చేరువ చేయాల్సిన తరుణంలో వాటిని నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. నమ్మకంతో గెలిపించుకున్న వైసిపి ప్రభుత్వం అంగన్‌వాడీలకు రోజుకొక పేరుతో అదనపు పనులు అప్పగిస్తూ భారం మోపుతుందని విమర్శించారు.

రూ. కోట్లు వెచ్చించినా నీటి ఇక్కట్లే!

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నతాధికారులు ముందుచూపు లేకుండా అన్ని రిజర్వాయర్ల లెవల్స్ ఎప్పటికపుడు పంపుతున్నా పట్టించుకోక పోవడం వల్ల ఒక్క పూటకుసరిపడా నిల్వలు కూడా రిజర్వాయ ర్లలో ఉండటం లేదని కిందిస్థాయి అధికారులు వాపోతున్నారు. గతంలో ఎంత పెద్ద సమస్య వచ్చినా ఒక్క రోజుకు సరిపడా నిల్వలు ఉండేవని ఇప్పుడు ఆ పరిస్థితి లేదని మొత్తం రిజర్వాయరు ఖాళీగా అవుతున్నా ఇంజినీరింగ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని రిజర్వాయర్ల నిర్వహణ సిబ్బంది వాపోతున్నారు. కీలకమైన లక్ష్మీపురం రిజర్వాయర్‌లో మొత్తం ఖాళీ అయ్యేపరిస్థితి వచ్చిందంటే శివారు ప్రాంతాల పరిస్థితి ఏమిటన్నదీ అంతుబట్టడం లేదు. ఇప్పటికే శివారు గ్రామాలకు నీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది. 24 గంటల నీటి సరఫరా లక్ష్యంతో ప్రపంచ బ్యాంకు నిధులు రూ.460 కోట్ల అంచనాలతో రూపొందించిన పథకం పూర్తయిందని చెబుతున్నా ఇప్పటికీ ఏ ప్రాంతంలోనూ గంట పాటు సక్రమంగా కుళాయిలకు నీరు వస్తున్న పరిస్థితి లేదు. పర్యవేక్షణా లోపం వల్ల కొన్ని ప్రాంతాలకు అవసరానికి మించి ఇవ్వడం, మరికొన్ని ప్రాంతాలకు అరకొరగా సరఫరా చేయడం పరిపాటైంది. విలీన గ్రామాలకు తాగునీటి సరఫరా సరిగా లేక ప్రజలు అల్లాడుతున్నారు. పన్నుల భారీగా వసూలు చేస్తూ కనీస సదుపాయలకల్పనపై నగరపాలక సంస్థ అధికారులు దృష్టి సారించడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

మిర్చిపై వెంటాడుతున్న 'తామర'

(మొదటి పేజీ తరువాయి)

ఉంటోంది. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో గతేడాది 2.26 లక్షల ఎకరాల్లో మిర్చి సాగుచేశారు. ఈ ఏడాది పల్నాడు జిల్లాలో 1.44 లక్షల ఎకరాల్లో మిర్చి సాగు చేస్తారని అంచనా వేయగా 1.39 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. గుంటూరు జిల్లాలో 54 వేల ఎకరాల్లో సాగు చేస్తారని అంచనా వేయగా 40 వేల ఎకరాల్లో సాగు జరిగింది. మొత్తంగా 1.93 లక్షల ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. సాధారణ విస్తీర్ణం కంటే 13 ఎకరాల్లో ఎక్కువగానే సాగు చేశారని అధికార వర్గాలు తెలిపాయి. మార్కెట్‌లో మిర్చి ధరలు ఆశాజనకంగా ఉండటం వల్ల రైతులు ఎక్కువ రోజులు వేచిచూసే ధోరణిలో ఉన్నా చివరికి గత నెల మొదటి వారంలో ఖరీఫ్ సీజన్ దాదాపుగా ముగింపు దశలో మిర్చి వైపు మొగ్గు చూపారు.

గతేడాది పంట దెబ్బతిన్నా పురుగు మందుల వినియోగం వల్ల కొన్ని ప్రాంతాల్లో పైరు నిలదొక్కుకుని ఫిబ్రవరి తరువాత ఎకరాకు తక్కువగా 10 క్వింటాళ్లు దిగుబడి వచ్చిందని, ధర క్వింటాళ్‌కు సగటున రూ.18-20 వేల వరకు లభించడం వల్ల రైతులు కొంత వరకు కోలుకున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కూడా మిర్చి వైపు మొగ్గు చూపారు. అయితే ఈ ఏడాది కూడా తెగుళ్ల ప్రభావం అధికం కావడంతో ఖర్చులు పెరుగుతాయని భావిస్తున్నారు. తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని పల్నాడు జిల్లా ఉద్యాన శాఖ అధికారి బి.జె.బెన్నీ తెలిపారు. రెంటచింతల మండడలంలో తామర పురుగులను శు క్రవారం పరిశీలించామన్నారు. అక్కడక్కడ బొబ్బరి ముడత గమనించినట్టు తెలిపారు. తెల్లదోమ తామర పురుగుల ఉధృతి తగ్గించడానికి ఎకరానికి జిగురు రాసిన పసుపు, నీలిరంగు అట్టలను 30-40 అట్టలను పెట్టుకోవాలని సూచించారు. బొబ్బర, తామర తెగులు నివారణకు వేప నూనె వినియోగించాలని సూచించారు. 10 రోజులకు వేప నూనెకు బదులు గానుగ నూనెను కలిపి పొలానికి పిచికారి చేయాలన్నారు. ఇందువల్ల రసంపిల్చె, లద్దే పురుగు లార్వా కొసస్థ దశలు కుడా నివారించవచ్చని తెలిపారు.

అత్యాచారం కేసులో సాంబయ్య అరెస్టు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో విద్యా నగర్‌లో దళిత బాలికను ఇంట్లో పనిమనిషిగా చేర్చుకుని ఆమెపై అత్యాచారానికి పాల్పడిన ప్రధాన నిందితుడు కోవెలమూడి సాంబయ్య చౌదరిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. ఈ ఘటనపై పలు విమర్శలు రావడంతో ప్రత్యేక దర్యాప్తు నిమిత్తం డిఎస్‌పి ప్రకాష్ బాబును జిల్లా ఎస్‌పి నియమించారు. ప్రకాష్ బాబు దర్యాప్తులో బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదులో పలు వాస్తవాలు ఉన్నట్టు నిర్ధారణ కావడంతో నిందితుడిని అరెస్టు చేశారు. పట్టాభిపురం ఎస్ఐ విజయ కుమార్ నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా కోర్టు రిమాండ్‌కు పంపింది.

ప్రజాశక్తి
గుంటూరు, పల్నాడు
3
శనివారం 26 నవంబర్ 2022

ఆస్పత్రిని ప్రజలకు చేరువ చేస్తున్నాం

- తెనాలి జిజిహెచ్ అభివృద్ధి కమిటి సమావేశంలో మంత్రి నాగార్జున
- బయోమెట్రిక్ కుంభకోణంలో వైద్యునిపై సస్పెన్షన్ వేటు

ప్రజాశక్తి-తెనాలి

డెల్టా ప్రాంతానికి తలమానికంగా ఉన్న జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో మరింత మెరుగైన వైద్యసేవలను ప్రజలకు చేరువ చేయనున్నామని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున అన్నారు. జిల్లా వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశం శుక్రవారం రాత్రి నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ జిల్లాలోని మంగళగిరి, తెనాలితో పాటు బాపట్ల జిల్లాలోని రేపల్లె, వేమూరు నియోజకవర్గాల పేదలకు వైద్యశాల ఎంతో విలువైన సేవలందిస్తోందన్నారు. జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. వైద్యశాలలో ఇప్పటికి 40 రకాల టెస్టులు అందుబాటులో ఉన్నాయిన, మరో మూడు నెలల్లో మరిన్ని సేవలను అందుబాటులోకి తెస్తామని చెప్పారు. రిఫరల్ కేసులు ఒక్కటి కూడా ఉండకూడదని, అన్ని రకాల వైద్యం ఇక్కడే అందేలా చర్యలు తీసుకంటామని చెప్పారు. గతంలో గుంటూరు కంటే తెనాలి వైద్యశాల మెరుగ్గా ఉండేదని, అయితే ప్రస్తుతం పరిస్థితి అందుకు భిన్నంగా ఉందన్నారు. సిబ్బంది సమిష్టిగా పనిచేసి, ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. తొలుత అసుపత్రిలో కొన్ని విభాగాలను మంత్రి పరిశీలించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, సబ్ కలెక్టర్ గీతాంజలిశర్మ, ట్రెయినీ కలెక్టర్ శివన్నారాయణశర్మ, ఏపివివిపి జిల్లా కోఆర్డినేటర డాక్టర్ జె.హణుమంతరావు, డీఎంఅండ్‌హెచ్‌వో సమయాఖాన్, వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి, కమిషనర్ ఎం.జస్వంతరావు పాల్గొన్నారు.



సమావేశంలో మంత్రి నాగార్జున, జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే

వైద్యునిపై సస్పెన్షన్ వేటు

ఆస్పత్రిలో బయోమెట్రిక్ హాజరు విధానాన్ని తప్పుదారి పట్టించిన వైద్యుడు డాక్టర్ వెంకటేశ్వరరావును సస్పెండ్ చేస్తూ వైద్యఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి నవీన్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎపివివిపి జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ జె.హనుమంతరావు వెల్లడించారు. విధులకు హాజరుకాకుండా సెక్యూరిటీ సిబ్బంది సాయంతో ప్లాస్టిక్ వేలిముద్ర ద్వారా హాజరు నమోదు చేస్తున్నట్లు అధికారులు గుర్తించిన సంగతి తెలిసిందే. దీనిపై విచారణ అనంతరం నివేదికను సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్య వాణి ఉన్నతాధికారులకు పంపిన నేపథ్యంలో డాక్టర్‌పై సస్పెన్షన్ వేటుపడినట్లు ఆయన వెల్లడించారు.



పెండింగ్ కేసులను పరిష్కరించండి

ప్రజాశక్తి - నకరికల్లు

స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సత్తెనపల్లి డీఎస్పీ విజయ భాస్కర్‌రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని ఎస్ఐ ఎస్ఐ సురేష్‌ను ఆదేశించారు. మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రౌడీషీటర్లపై నిఘా ఉండాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని, అందుకుగాను డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టాలని చెప్పారు. దొంగతనాలు జరగకుండా రాత్రి వేళలో గస్తీ ముమ్మరం చేయాలన్నారు. డీఎస్పీ వెంట సత్తెనపల్లి రూరల్ సిఐ ఉమేష్, సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి - ఇద్దరికి గాయాలు



రంగారావు మృతదేహం

ఘటనా స్థలిలో క్షతగాత్రులు వీరయ్య, మోహన్

ప్రజాశక్తి - తాడికొండ

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో శుక్రవారం వాటిల్లిన రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి చెందగా ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. పోలీసుల వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా తాడికొండ మండలం పొన్నెకల్లుకు చెందిన మంగళగిరి రంగారావు (50) గుంటూరు నుండి ద్విచక్ర వాహనంపై పొన్నె కల్లుకు వస్తుండగా లాం శివారులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వద్ద అడ్డ రోడుడ్డ నుండి గుంటూరు వైపు వస్తున్న హైకోర్టు అడ్వకేట్లు, ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో రంగారావు అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలిని పోలీసులు పరిశీలించి విచారణ చేపట్టారు.

ప్రజాశక్తి - నాదెండ్ల

చిలకలూరిపేట మండలం మిట్టపాలేనికి చెందిన కె.వీరయ్య ద్విచక్ర వాహనంపై గుంటూరు వైపు వస్తుండగా నాదెండ్ల మండలం గణపవరంలో కలకత్తా - చెన్నయ్ జాతీయ రహదారిపై ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన వీరయ్యను 108 ద్వారా చిలకలూరిపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషయమంగా ఉండడంతో ప్రాథమిక చికిత్సానంతరం గుంటూరు జిజిహెచ్‌కు తరలించారు.

ప్రజాశక్తి- పిడుగురాళ్ల

పట్టణంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద రోడ్డు ప్రమాదంలో వాలంటీర్ గాయపడ్డాడు. స్థానిక 2వ సచివాలయంలో వాలంటీర్‌గా పని చేస్తున్న మోహన్ ద్విచక్ర వాహనంపై వెళ్తూ ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో స్థానిక ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్సానంతరం నర్సరావుపేటకు తరలించారు.



మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	: 19,178
మిర్చి ఎగుమతి	: 20,778
మిర్చి నిల్వ	: 9,421

మిర్చి ధరలు

	రూపాయలలో
334	10,000 - 26,500
273	20,000 - 20,700
341	16,600 - 26,500
నాన్ ఎసి	
తేజ	9,000 - 25,000
బడిగె	14,000 - 27,500
దేవనూరు డీలక్స్	13,500 - 28,000
తాలుకాయలు	4,500 - 13,500
ఎసి	
334	14,000 - 27,000
నెం.5	15,000 - 26,000
341	20,000 - 27,500
తేజ	9,200 - 22,000
బడిగె	22,000 - 27,000
దేవనూరు డీలక్స్	22,000 - 26,000
తాలుకాయలు	6,000 -12,500

గుట్టుగా గర్భస్థ శిశువు ఖననం

ప్రజాశక్తి - పెదకూరపాడు

గర్భస్థ శిశువును గుట్టుచప్పుడు కాకుండా ఖననం చేయడం నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులో శుక్రవారం సంచలనం కలిగించింది. గుర్తు తెలియని వారు ఒ శిశువు మృతదేహాన్ని సత్తెనపల్లి -అమరావతి రోడ్డులో ఉన్న స్మశాన వాటికలో పూడ్చి పెట్టారని సమాచారం అందుకున్న విఆర్ఒ నరసింహారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రెవెన్యూ, పోలీసులు, వైద్యాధికారులు అక్కడికి చేరుకున్నారు. శిశువు మృతదేహానికి తహశీల్దార్ క్షమారాణి పర్యవేక్షణలో అమరావతి వైద్యులు శవపంచనామా నిర్వహించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణారావు తెలిపారు.



శ్మశానంలో శవపంచనామాను పర్యవేక్షిస్తున్న పోలీసులు, అధికారులు

ప్రత్యేక హోదాను వెతకాలని ఫిర్యాదు

ప్రజాశక్తి - తాడేపల్లి



ప్రత్యేక హోదాను వెతికిపెట్టండంటూ తాడేపల్లి పోలీస్టేషన్‌లో తెలుగు యువత నాయకులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. 23 మంది ఎంపిలను గెలిపిస్తే ప్రత్యేక హోదాను తెస్తానని వాగ్దానం చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దాన్ని నెరవేర్చలేదని, ఆయన తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విజయసాయిరెడ్డి పిఎ సెల్‌ఫోన్ వెతికినట్లు హోదానూ వెతికి తేవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు ఆర్.సాయికృష్ణ, జె.వెంకటేశ్, బి.హరికృష్ణ, పి.మహేశ్, ఫిరోజ్, సిహెచ్.లీలాకృష్ణ, కె.మధుబాబు పాల్గొన్నారు.

సుబాబుల్ తోటలో అస్థిపంజరం

ప్రజాశక్తి - నరసరావుపేట

పట్టణంలోని వల్లపచెరువు సమీపంలోని సుబాబుల్ తోటలో గుర్తుతెలియని మతదేహాన్ని రైతులు శుక్రవారం గమనించారు. ఇది తెలిసిన డీఎస్పీ చిన విజయభాస్కర్‌రెడ్డి,, సిఐ అక్కడికి చేరుకున్నారు. మృతనికి 40 ఏళ్లలోపు వయస్సు ఉంటుందని, నెల క్రితం మృతి చెంది ఉండొచ్చని భావిస్తున్నారు. రెవెన్యూ, ప్రభుత్వ వైద్యుల సమక్షంలో అస్థిపంజరంలోని నమూనాలు సేకరించారు. అనంతరం అంత్యక్రియలు చేశారు. ఇటీవల నమోదైన మిస్సింగ్ కేసులను పరిశీలించి దర్యాప్తు కొనసాగిస్తామని డీఎస్పీ తెలిపారు.

గంజాయి విక్రేత అరెస్టు

ప్రజాశక్తి - ముప్పాళ్ల

గంజాయిని అక్రమంగా నిల్వ ఉంచి సతైనపల్లి చుట్టుపక్కల ప్రాంతాల్లో అమ్ముతున్న వ్యక్తిని ముప్పాళ్ల పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు వివరాలను సిఐ ఆర్.ఉమేష్, ఎస్ఐ పట్టాభిరామయ్య శుక్రవారం వెల్లడించారు. ముప్పాళ్ల మండలంలోని తొండపి గ్రామానికి చెందిన షేక్ జాన్‌సైదా గంజాయిని వివిధ ప్రాంతాలలో కొనుగోలు చేసుకొని వచ్చి సత్తెనపల్లి చుట్టుప్రక్కల గ్రామాల్లో అమ్ముతున్నాడు. రెండు కిలోల గంజాయి బైక్‌పై పెట్టుకుని తొండపి నుండి మాదల మీదుగా వెళ్లుతుండగా సమాచారం అందుకున్న ఎస్ఐ పట్టాభిరామయ్య గురువారం సాయంత్రం మాదల అడ్డురోడ్డు వద్ద జాన్‌సైదాను అరెస్టు చేశారు. గంజాయిని, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుణ్ణి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారు.



మహిళలను పోలీసులకు అప్పజెబుతున్న స్థానికులు

చోరీకి యత్నించారని..

ప్రజాశక్తి- మేడికొండూరు

పాత సామాన్లు కొనేందుకు వచ్చిన ముగ్గురు మహిళలు చోరీకి యత్నించి పట్టుబడిన ఘటన మండలంలోని భీమినేనివారిపాలెంలో శుక్రవారం చోటుచేసుకుంది. పాత సామాన్లు కొనేందుకని గుర్తు ముగ్గురు మహిళలు గ్రామంలోకి వచ్చారు. ఎవరు లేని ఇళ్లను గుర్తించి, ఆ ఇళ్లల్లోకి చొరబడి చోరీకి యత్నిస్తుండగా కొందరు గుర్తించి పట్టుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వారిని స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు.



సిఐ సాంబశివరావుతో సమస్య చెబుతున్న బాధితురాలు

వేధింపుల నుండి కాపాడండి

ప్రజాశక్తి - తాడేపల్లి

కులాంతర వివాహం చేసుకున్నందుకు తమ బంధువుల నుండి వేధింపులు అధికమయ్యాయని కృష్ణాజిల్లా పోరంకికి చెందిన రాయన జ్ఞానేంద్ర అతని భార్య అనూష ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం సిఎం క్యాంపు కార్యాలయం వద్ద తమ బాధ చెప్పుకోవడానికి భార్యాభర్తలు వచ్చారు. తాడేపల్లి సిఐ సాంబశివరావు వారిని అడ్డుకొని అక్కడ నుండి పంపించి వేశారు. సంబంధిత పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. అయితే ఎక్కడకు వెళ్లినా తమకు న్యాయం జరగడం లేదని పోలీసు అధికారులతో తమగోడు వెళ్ళబోసుకున్నారు. తమపై గతంలోనూ హత్యాప్రయత్నం జరిగిందన్నారు. ఆస్తుల కోసం తన భర్త బాబాయిలు, బంధువులు తమను చంపేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ఇద్దరు పిల్లలున్న తమ కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా పోలీసులకు, బాధితులకు మధ్య వాగ్వివాదం జరిగింది. అనంతరం నచజెప్పి బాధితులను అక్కడ నుండి పంపించి వేశారు.



దాచేపల్లి తోపుడుబండ్ల కార్మికుల నూతన సంఘం ఏర్పాటు

- నాగులేరు పక్కకు మార్చొద్దు
- పోలీసుల వేధింపులు మానుకోవాలి
- తోపుడుబండ్ల కార్మికుల డిమాండ్

ప్రజాశక్తి-దాచేపల్లి

దాచేపల్లి తోపుడుబండ్ల కార్మికుల నూతన సంఘంను శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దాచేపల్లిలోని తోపుడు బండ్ల కార్మికుల సమావేశం జరిగింది. అనంతరం కార్మికులు మాట్లాడుతూ ఈ సంఘం సిఐటియుకి అనుబంధంగా ఉంటుందని తెలిపారు. అనేక సంవత్సరాలుగా తాము రోడ్డు పక్కన తోపుడుబండ్లపై పండ్లు అమ్ముకుని జీవనం కొనసాగిస్తున్నామని, ఇటీవల కాలంలో అధికారులు తమను నాగులేరు వద్దకు మారాల్సిందిగా డిమాండ్ చేస్తున్నారని చెప్పారు. కానీ, తాము ఆ ప్రాంతానికి వెళ్ళినట్లయితే తమ వ్యాపారాలు పూర్తిగా దెబ్బతిని తమ జీవనోపాధి కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు, అంతేకాకుండా పెట్టి కేసుల పేరుతో పోలీసుల వేధింపులు పెరి గాయని అన్నారు. పోలీసులు వారిపై కేసులు పెట్టకుండా ఉండాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిఐటియు మండల నాయకులు ఆంజనేయరాజు పాల్గొని నూతన కమిటీని అభినందించడం జరిగింది.

కెవిపిఎస్ పల్నాడు జిల్లా నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - క్రోసూరు



స్థానిక బంకా పుల్లారావు నగర్(ఆమంచి విజ్ఞాన కేంద్రం) లో జరిగిన కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం పల్నాడు జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా చింతపల్లి నాగమల్లేశ్వరరావు, జి రవి బాబును ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రవిబాబు మాట్లాడుతూ దళితులపై కొనసాగు తున్న కుల వివక్షత, అంటరానితనం నిర్మూలనే లక్ష్యంగా పని చేస్తున్న సంఘం జిల్లా మహాసభ తమను ఎన్నుకోవడం ద్వారా తమరింత బాధ్యతను పెంచిందన్నారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నికరంగా దళితుల సామాజిక,ఆర్థిక సమస్యల మీద తీవ్రమైన ఆందోళనలు, పోరాటాలను నిర్వ హించేందుకు ప్రణాళికను రూపొందించ డం జరుగుతుంద న్నారు. అత్తలూరులో దళిత మహిళ సర్పంచ్ బంకా సరోజిని విధులకు ఆటంకం కలిగించి, కులం పేరుతో దూషించి, కుటుంబసభ్యులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.నరసరావుపేటకు చెందిన, తల్లిదం డ్రులను కోల్పోయిన దళిత బాలికను దగ్గరికి తీసి యుక్త వయసు వచ్చిన తర్వాత అత్యాచారానికి పాల్పడ్డ అప్పాపురం గ్రామానికి చెందిన సాంబయ్య చౌదరి, మరో ముగ్గురిపై కేసు నమోదు చేయకపోవడం దుర్మార్గమన్నారు. మహాసభ జిల్లా సంఘం ఉపాధ్యక్షులుగా ముత్యాల పౌలును, సహాయ కార్య దర్శులుగా ఎం.విల్సన్, ఎం. ఆంజనేయులును, జిల్లా కమిటీ సభ్యులుగా ఎ.సుంద రయ్య, బి.రామారావు,ఎ.జకరయ్య, వీర బాబు, ఎస్.రాజశేఖర్, బి.మేరీ, జి.గంగయ్య,లీగల్ అడ్వై జర్ గా జి.సురేష్ తోపాటు ముగ్గురు కోఆప్షన్ సభ్యులను కలుపు కొని మొత్తం 17 మందితో నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు.

సమ సమాజ స్థాపనకు 'చాపకూడు'

- నరసరావుపేట ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు
- బ్రహ్మనాయుడు ఆశయాలను కొనసాగిద్దాం

ప్రజాశక్తి - కారెంపూడి

సమ సమాజ స్థాపన కోసం బ్రహ్మనాయుడు కుల,మత, వర్గ విభేదాలు లేకుండా ఆనాడే చాపకూడు (సహపంక్తి భోజనాలు) ఏర్పాటు చేశారని నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. శుక్రవారం వీర్ల దేవాలయ ప్రాంగణంలోని చాపకుడు మండపంలో చాపకుడు కార్యక్రమం జరిగింది. వీర్ల దేవాలయం,వీర్ల అంకమ్మ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సర్వమత ప్రార్థనలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ బ్రహ్మనాయుడు ఆశ యాలను భావితరాలు గుర్తుంచుకునేలా చూసుకోవాల్సిన బాధ్యత పల్నాటి ప్రాంత ప్రజలపై ఉందన్నారు. చరిత్రను, చిహ్నాలు దేశ నలుమూలకు విస్తరింపజేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

వీర్ల దేవాలయాన్ని అభివృద్ధి చేస్తాం

ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ పల్నాటి వీరారాధనోత్సవాలు ఐదు రోజులపాటు జరగటం చాలా ఆనందంగా ఉందన్నారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశామని తెలిపారు. వీర్ల దేవాలయ అభివృద్ధి విషయాన్ని ముఖ్యమంత్రి జగన్ దృష్టికి తీసుకువెళతామని, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఆచార వంతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండేం దుకు గదులు నిర్మాణం చేపడతామని చెప్పారు.

ప్రభుత్వ ఉత్సవాలుగా ..

పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ ఎంతో చరిత్ర కలిగిన పల్నాటి వీర్ల తిరుణాళ్ళను ప్రభుత్వ ఉత్సవాలుగా జరుపుకునేలా చూస్తామన్నారు. ఉత్సవాలకు అవసరమైన నిధులు కల్పించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు.

విభిన్న సంస్కృతి, సంప్రదాయాల పల్నాడు

పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్ రెడ్డి మాట్లాడుతూ కుల వ్యవస్థను నిర్మూలించి అందరూ సమానత్వమే అనే భావనతో చాపకుడు కార్యక్రమం నిర్వహించడం కారంపూడి ప్రాంత ప్రజలకు ఆయన అభినందనలు తెలిపారు. పల్నాడు ప్రాం తం కక్షలు,కార్పణ్యాలకు మాత్రమే కాదు విభిన్న సంస్కృతీసంప్రదాయాలకు నెలవైన ప్రాంతంగా చెప్పవచ్చన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రజాప్రతి నిధులకు,ప్రభుత్వ అధికారులకు పల్నాటి వీరాచార పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ, ఉత్సవాల్లో నిర్వహించే క్రతువుల గురించి వివరించారు. పల్నాటి యుద్ధంలో యుద్ధవీరులు ఉపయోగించిన ఆయుధాలను పరిశీలించారు. అనంతరం చాపకుడు కార్యక్రమంలో పీతాధిపతితో కలిసి భోజనాలు చేశారు.చాపకుడు కార్యక్రమంలో సుమారు పదివేల మంది ప్రజలు పాల్గొన్నారు. కార్యక్రమంలో గురజాల డిఎస్పి జయరాం ప్రసాద్, సీఐ దార్ల జయకుమార్,ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి, తహశీల్దార్ శ్రీనివాస్ యాదవ్, వైసిపి నాయకులు కె.వి.రావు తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళల స్టాల్ ఏర్పాటు

పల్నాటి వీరారాధనోత్సవాల సందర్భంగా డ్వాక్రా మహిళలు తయారు చేసిన వస్తువుల స్టాల్‌ను వీర్ల దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. రకరకాల రంగులతో తయారు చేసిన పువ్వులను ఉత్సవాలకు వచ్చే ప్రజలు తిలకించేందుకు ఉంచారు. అదేవిధంగా రకరకాల పచ్చళ్ళు, కారం పొడులు కూడా తయారు చేసి, ప్రజలు ఏ విధంగా తయారు చేసుకోవాలనే దానిపై అవగాహన కల్పించారు.

ఉచిత వైద్య శిబిరం

వీర్ల దేవాలయ ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఉత్సవాలకు వచ్చే ప్రజలకు ఇబ్బంది కలుగకుండా ఉండేందుకు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు అడిషనల్ డిఎంహెచ్ఒ చంద్రశేఖర్ తెలిపారు. ఉచితంగా మందులు పంపిణ,108 వాహనాన్ని కూడా అందుబాటులో ఉంచినట్లు చెప్పారు.











వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు ఆపేయాలి : రైతు సంఘం

ప్రజాశక్తి - క్రోసూరు



స్థానిక ఆమంచి విజ్ఞాన కేంద్రంలో రైతు సంఘం మండల కార్యదర్శి అత్తోట వెంకట అప్పారావు అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించడాన్ని ఆపివేయాలని . తీర్మానించారు. వెంకట అప్పారావు మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్‌లో ఈ ప్రాంతంలో సాగు చేసిన అన్ని పంటలు దిగుబడులు ఆందోళనకరంగా ఉన్నా యన్నారు. పత్తి దాదాపు 50 శాతం దిగుబడి తగ్గిందని, మిర్చి పంట మీద వస్తున్న చీడపీడలు ఎన్ని సస్యరక్షణ చర్యలు చేపట్టినప్పటికీ నివారణ కాకపోవడంతో రైతులు ఆందోళనచెందుతున్నారని అన్నారు. ఇక వరి పంటకు సంబంధించి పెట్టుబడులు అంతంతమాత్రంగానే వస్తున్న నేప థ్యంలో ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు రైతుల వద్దకు వెళ్లి పంట నష్టపరిహారాన్ని పరి శీలించి వారికి భరోసా కల్పించే చర్యలు చేపట్టా లన్నారు. రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఆవుల ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశామని ప్రచార అర్భాటం చేసుకుంటోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ లను అమలు చేయకుండా మోసం చేసి రెండేళ్లయిన నేపథ్యంలో రైతు సంఘం ఆధ్వర్యంలో విజయ వాడలో ధర్నా చౌక్ వద్ద నిర్వహిస్తున్న ధర్నా కార్యక్రమానికి రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొ నాలని కోరారు. క్రోసూరు కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి తిమ్మిశెట్టి హను మంతరావు మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయంలో తీసుకొస్తున్న మార్పుల పట్ల అప్ర మత్తంగా ఉంటూ రైతులు, కౌలురైతులు ఐక్యంగా పోరాటాలు చేయకపోతే వేరే రూపాలలో వ్యవసాయాన్ని పూర్తిగా కార్పొరేట్ల కు కట్టబెడతారన్నారు. సమావేశంలో రైతు సం ఘం కమిటీ సభ్యులు నక్క వెంకట్రావు , బుర్రి శ్రీనివాసరావు, యార్లగడ్డ నాగేశ్వరరావు,ఎస్‌కె మస్తాన్, గంటెల. శౌరి, దగ్గు నటరాజు, జడ పేతురు, గల్లా రమణమ్మ, గంటల చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

నరసింగపాడును ఆదర్శంగా తీసుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి - నకరికల్లు



'కాఫీ విత్ క్లాప్ మిత్ర'లో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ శివశంకర్

జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామం పరిశుభ్రంగా ఉండేలా క్లాప్ మిత్రాలు చూడాలని పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ అన్నారు. 'కాఫీ విత్ క్లాప్ మిత్ర' కార్యక్రమాన్ని ప్రతి శుక్రవారం పల్నాడు జిల్లాలో నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. మండలంలోని నరసింగపాడులో ఘన వ్యర్థాల నుండి సంపద తయారీ కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. ముందుగా ఎస్ డబ్ల్యూ పిసిలో ఆయన మామిడి మొక్కను నాటారు. క్లాప్ మిత్రాలతో కలిసి కాఫీ తాగుతూ సమావేశం నిర్వహించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో 509 ఘన వ్యర్థాల నుండి సంపద తయారు చేయు కేంద్రాలు ఉన్నాయని, వాటిలో 3,000 మంది క్లాప్ మిత్రాలు పని చేస్తున్నారని తెలిపారు. నకరికల్లు మండలంలో 64 మంది క్లాప్ మిత్రాలు పని చేస్తున్నారని వారందరికీ జీతాలు సక్రమంగా పంచాయతిలు చెల్లిస్తున్నాయని అన్నారు.

సమాజంలో క్లాప్ మిత్రాల పాత్ర చాలా ముఖ్యమైందని, వారందరూ గ్రామంలోని ప్రతి ఇంటికి తిరుగుతూ తడి, పొడి చెత్తలను వేరుచేసి పంచాయతిలకు సంపదను సమకూర్తున్నారని అన్నారు. వారందరికీ వైఎస్సార్ బీమా, ఈబి శ్రమకార్డులను తప్పనిసరిగా అందజేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మిత్రాలలోని ఒంటరి మహిళలకు పింఛన్లు, ఇళ్ల స్థలాలు లేని వారికి స్థలాలు మంజూరు చేస్తామని, వారందరికీ ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేస్తామని తెలిపారు. స్థలాల కోసం తహశీల్దార్, ఎంపిడిఒ, పంచాయతి కార్యదర్శి, గృహ నిర్మాణ శాఖ ఏఈ, వారందరూ కలిసి నిర్ణయం తీసుకొని తనకు చెబితే రెండు నెలల్లోపు సమస్యలన్నీ పరిష్కరిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. అనంతరం సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించిన ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. క్లాప్ మిత్రాలను మెచ్చుకున్నారు. ప్రతి ఒక్క గ్రామం నరసింగపాడు ను ఆదర్శవంతంగా తీసుకోవాలని సూచిం చారు. **సత్తెనపల్లి రూరల్:** మండలంలోని నందిగామ ఘనవ్యర్థాల నిర్వహణా కేంద్రం లో 'కాఫీ విత్ క్లాప్ మిత్ర' నిర్వహించారు .చెత్త సేకరణలో కీలకపాత్ర పోషిస్తున్న గ్రీన్ అంబాసిడర్స్‌తో కలిసి అధికారులు కాఫీ తాగారు. వారి ఇంబ్బందులను అడిగి తెలుసుకున్నారు. **విజయపురిసౌత్:** మాచర్ల మండలంలోని తాళ్లపల్లిలో పారిశుధ్య కార్మికులతో 'కాఫీ విత్ క్లాప్ మిత్ర' నిర్వహించారు, పారిశుధ్య కార్మికులాతో కలసి కాఫీ, ఫలహారం తీసుకున్నారు.





కొలనుకొండలో ప్రచార కరపత్రాల పంపిణీలో జొన్నా శివశంకర్ తదితరులు



గుంటూరు సమావేశంలో మాట్లాడుతున్న అజయ్‌కుమార్, బైరగాని తదితరులు

మద్యాన్ని పూర్తిగా నిషేధించాలి

ఐద్వా ఆలిండియా కోశాధికారి పుణ్యవతి

ప్రజాశక్తి-గుంటూరు : మహిళలపై హింసకు కారణమవుతున్న మద్యాన్ని పూర్తిగా నిషేధించాలని ఐద్వా ఆలిండియా ట్రెజరర్ ఎస్.పుణ్యవతి డిమాండ్ చేశారు.ప్రపంచ హింసా వ్యతిరేక దినం సందర్భంగా శుక్రవారం ఐద్వా ఆధ్వర్యంలో స్థానిక రెవెన్యూ కళ్యాణ మండపం నుండి కంకరగుంట బ్రిడ్జి వరకూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పుణ్యవతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల పుస్తెలను పణంగా పెట్టి మద్యం విక్రయాలు చేపడుతుందన్నారు. పరిపాలన చేతకాక, మద్యాన్ని విక్రయిస్తూ కుటుంబాలను ఛిన్నాభిన్నం చేస్తుందన్నారు. మద్యం మత్తులో మహిళలపై హింస చెలరేగుతుందన్నారు. ప్రతి గ్రామంలో మద్య వ్యతిరేక కమిటీలు ఏర్పడి పోరాడాలని మహిళలకు పిలుపునిచ్చారు. ఐద్వా జిల్లా కార్యదర్శి అరుణ మాట్లాడుతూ మహిళలపై పాలకులే హింసను ప్రేరేపిస్తున్నారన్నారు. మహిళలు వస్త్రధారణపై, భావ వ్యక్తీకరణపై కేంద్ర మంత్రుల స్థాయిలో వక్రభాష్యాలు చెబుతున్నారన్నారు. ఇది సమాజంలో స్త్రీలపై దాడులకు ఊతం ఇచ్చినట్లు అవుతుందన్నారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డి.శ్రీనివాసకుమారి, నాయకులు కళ్యాణి, కుసుమకుమారి తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధరల కోసం నేడు ధర్నా

జయప్రదం చేయాలని రైతు సంఘం నాయకుల పిలుపు - విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-గుంటూరు

నల్లచట్టాలకు వ్యతిరేకంగా నవంబర్ 26న ఢిల్లీలో చారిత్రాత్మక రైతు పోరాటం ప్రారంభమైన రోజును పురస్కరించుకొని గిట్టుబాటు ధరలు, రుణ విముక్తి, విద్యుత్ మీటర్ల రద్దు తదితర డిమాండ్ల సాధనకు విజయవాడలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని అఖిలపక్ష రైతు సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక బ్రాడీపేటలోని పిఎల్‌రావు భవన్‌లో అఖిల పక్ష రైతు సంఘాల నాయకులు కంచుమాటి అజయ్, కాల్వ శ్రీధర్‌రావు, పిల్లి చెన్నకేశవులు, బైరగాని శ్రీనివాసరావు, కందుల విఠల్‌రెడ్డి, కొనసాగాలి పూర్ణచంద్రరావు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఢిల్లీ రైతు ఉద్యమం విరమణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం పంటల మద్దతు ధరల చట్టాలు తెస్తామని, విద్యుత్ చట్ట సవరణ నుండి వ్యవసాయాన్ని మినహాయిస్తామని, రైతులపై కేసులు ఉపసంహరిస్తామని పలు హామీలు ఇచ్చినా అమలు చేయలేదన్నారు. ఈ నేపథ్యంలో 26న గవర్నర్‌కు మెమోరాండాలు ఇవ్వాలని, డిసెంబర్ 1-11 వరకూ పార్లమెంట్, రాజ్యసభ సభ్యులు మెమోరాండాలు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. అఖిల పక్ష రైతు సంఘాల కార్యక్రమంలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేయాలని, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు అన్నారు. శుక్రవారం ఎం.టి.ఎం.సి పరిధిలోని కొలను కొండలో రైతు నాయకులతో కలిసి, ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. కరపత్రాలు పంపిణీ చేసి, విస్తృత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి కాజా వెంకటేశ్వరరావు, మంగళగిరి మండల రైతు సంఘం సీనియర్ నాయకులు ముసలి పకీరయ్య, సిపిఎం మంగళగిరి మండల కార్యదర్శి మొసలి జ్యోతి బస్, కాట్రగడ్డ శ్రీనివాసరావు, కొడవటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి : విజయవాడ ధర్నా చౌక్ లో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని రైతు సంఘం నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం మంగళగిరి సీపీఐ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ రైతు సంఘం విస్తృత సమావేశంలో జిల్లా రైతు సంఘం అధ్యక్షులు కే రంగారెడ్డి, కార్యదర్శి పి శివాజీ, ఏరియా కార్యదర్శి సాంబిరెడ్డి, వై వెంకటేశ్వరరావు, చిన్ని తిరుపతయ్య ప్రసంగించారు.

జొన్నల కోటిరెడ్డి కన్నుమూత

సిపిఎం జిల్లా కమిటీ సంతాపం - నంబూరులో నేడు అంత్యక్రియలు

ప్రజాశక్తి - గుంటూరు



సిపిఎం అభిమాని జొన్నల కోటిరెడ్డి మూర్తి (91) శుక్రవారం కన్నుమూశారు. ఆయన మృతికి పలువురు సంతాపం ప్రకటించారు. కోటిరెడ్డికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ మొత్తం వామపక్ష ఉద్యమ అభివృద్ధికి తోడ్పడ్డారు. ఉపాధ్యాయునిగా పనిచేసిన కోటిరెడ్డి ఉపాధ్యాయ ఉద్యమంలోనూ దీర్ఘకాలం, చురుగ్గా పనిచేశారు. ఆయన మృతికి సిపిఎం గుంటూరు జిల్లా కమిటీ సంతాపం తెలుపుతుందని ఆపార్టీ జిల్లా కార్యదర్శి పాశం రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. సిపిఎం పూర్వ జిల్లా కార్యదర్శి ఈదా మాధవరెడ్డి, ఉపాధ్యాయ సంఘ నాయకులు వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలిపారు. వారి కుటంబసభ్యులకు సానుభూతి ప్రకటించారు.

నేడు అంత్యక్రియలు

జొన్నల కోటిరెడ్డి మూర్తికి శనివారం స్వగ్రామం నంబూరులో ఉదయం 10 గంటల తర్వాత అంత్యక్రియలు నిర్వహిస్తారని కుటుంబ సభ్యులు తెలిపారు.

రెండో రోజూ ఉత్సాహంగా కళాకారుల ప్రదర్శనలు

మరోసారి నృత్యంతో సందడి చేసిన మంత్రి రోజా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జగనన్న స్వర్ణోత్సవ సాంస్కృతిక సంబరాలు జోనల్ స్థాయి పోటీలు రెండో రోజు ఉత్సాహంగా కొనసాగాయి. శనివారం కూడా ఈ పోటీలు జరుగుతాయి. వివిధ రకాల ప్రదర్శనలు ఉత్సాహంగా జరిగాయి. కళాకారులతో కలసి మంత్రి రోజా నృత్యం చేసి కళాకారులను ఉత్సాహపరిచారు. రాష్ట్ర సాంస్కృతిక శాఖ చైర్ పర్సన్ వంగపండు ఉషా ఆలపించిన గీతం ఆహుతులను ఆకట్టుకుంది. ఉదయం కూచిపూడి సోలో బృంద నృత్యాలు, జానపదం, శాస్త్రీయ నృత్యాలు, చెక్క భజన కార్యక్రమాలు సాయంత్రం డప్పు, లంబాడి ప్రదర్శనలు నిర్వహించారు. కళాకారులకు ప్రశంసా పత్రాలను మంత్రులు రోజా, అంబటి రాంబాబు, మేరుగ నాగార్జున, మండలిలో చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎంపి లావు కృష్ణదేవరాయులు తదితరులు అందచేశారు. ఎమ్మెల్సీ టి.కల్పలత, శాసనసభ్యులు మహమ్మద్ ముస్తఫా, మద్దాలి గిరిధర్ రావు, ఉండవల్లి శ్రీదేవి, మహమ్మద్ ముస్తఫా తదితరులు పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన నాట్యాచార్య ఉమామహేశ్వర పాత్రుడు డాక్టర్ వి.రామకృష్ణ(నృత్యాలకు), కే.వి. అనంత శయనం, యశోధర (సంగీతానికి), డాక్టర్ చిట్టినేని శివకోటేశ్వరరావు, బాబ్జి (జానపదానికి) లను సత్కరించి, షీల్డ్, ప్రశంసా పత్రం అందించి, మంత్రి రోజా సన్మానించారు. ఈనెల 29, 30,డిసెంబర్ 1 తేదీలలో రాజమహేంద్రవరంలో జరిగే జగనన్న స్వర్ణోత్సవ సాంస్కృతిక సంబరాలు జోనల్ స్థాయి పోటీలకు సంబంధించి రూపొందించిన ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు.







ఆంధ్ర క్రికెట్ స్టేడియం అభివృద్ధికి కృషి

అభివృద్ధి పనులు ప్రారంభించిన కలెక్టర్ వేణుగోపాలరెడ్డి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ : మంగళగిరిలోని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ క్రికెట్ స్టేడియంలో నిర్మించిన క్రీడాకారుల డ్రెస్సింగ్ రూమ్, మ్యాచ్ అఫీషియల్ రూములు సీసీ రోడ్లను జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం మీడియాతో కలెక్టర్ మాట్లాడుతూ స్టేడియంను అధునా తనంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశ్యంతో నిర్మించామన్నారు. క్రికెట్ స్టేడియం ప్రారంభానికి కొన్ని న్యాయపరమైన చిక్కులు అడ్డంకిగా ఉన్నాయని, అవి తొలగిన వెంటనే ప్రారంభమవుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శివారెడ్డి మాట్లాడుతూ, అన్ని హంగులతో క్రికెట్ స్టేడియాన్ని తీర్చిదిద్దినట్లు చెప్పారు. బీసీసీఐ నిధులతోనే క్రికెట్ స్టేడియం నిర్మాణం జరిగిందని, త్వరలో రంజీ ట్రోఫీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మంగళగిరి తహశీల్దార్ రామ్ ప్రసాద్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎం. వెంకట శివారెడ్డి, మేనేజర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - మంగళగిరి : మంగళగిరి పట్టణంలోని 11వ సచివాలయాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. రికార్డులను, రిజిస్టర్స్, పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ అధికారులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని కోరారు. ప్రజలకు సేవ చేయాలనే బాధ్యత ఉండాలని తెలిపారు. ప్రతిరోజు సచివాలయంలో సాయంత్రం మూడు గంటల నుండి ఐదు గంటల వరకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలను పరిష్కరించాలని, సమస్యను బట్టి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చేయాలని కోరారు. కార్యదర్శులు వార్డుల్లో సర్వేలను సక్రమంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ యు శారదా దేవి, తాసిల్దార్ జివి రాంప్రసాద్, ఎంపీడీవో రామ ప్రసన్న, సచివాలయ సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.





వైద్య శిబిరం ప్రారంభిస్తున్న చంద్రగిరి ఏసురత్నం

మిర్చి యార్డులో మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మిర్చి యార్డు స్నేహ నేస్తం ఎంప్లాయిస్ అసోసియేషన్ 5వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం ప్రారంభించారు. ఉచిత దంత, కంటి పరీక్షలు, మెగా రక్తదానం శిబిరం నిర్వహించారు. ఉద్యోగులు, ముఠాకార్మికులు, కమిషన్ ఏజెంట్లు పరీక్షలు చేయించుకున్నారు. వార్షికోత్సవంలో బాగంగా 40 సంవత్సరాలు పైగా గుమస్తాలుగా సేవలు అందించిన వారికి అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానం జరిగింది. ఒక్కొక్కరికి రూ.21 వేలు చొప్పున నగదు పురస్కారం అందించారు. గుమస్తా గా కొనసాగుతూ మరణించిన వారి కుటుంబానికి రూ. 40 వేలు, 6నెలలుకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. 200 మంది పైగా బ్లడ్ డొనేషన్ చేసిన వారికీ యార్డ్ ఛైర్మెన్ చంద్రగిరి ఏసురత్నం సర్టిఫికేట్ అందజేశారు. కార్యక్రమంలో కార్మికుల అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.ఎం. శ్రీనివాసరెడ్డి ,స్నేహ నేస్తం ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ప్రెసిడెంట్ అర్జున్ రెడ్డి , కార్యదర్శి మారుతి ప్రసాద్, రాజా , ఎగుమతి,దిగుమతి అసోసియేషన్ పాల్గొన్నారు.

ఉద్యోగులకు బకాయిలు విడుదల చేయాలి : ఎస్‌డబ్ల్యూఎఫ్

ప్రజాశక్తి-గుంటూరు : ఆర్టీసి ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న లీవు ఎన్‌క్యాష్‌మెంట్, పిఆర్‌సి ఎరియర్స్, ఇతర బకాయిలన్నింటినీ తక్షణమే చెల్లించాలని ఎపిపిటిడి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి యం.హరిప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎన్‌టిఆర్ బస్‌స్టేషన్‌లో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జరిగిన నిరసన కార్యక్రమంలో మాట్లాడారు. ఆర్టీసిలో ఇప్పటికే ఉన్న అద్దె బస్సులు కాకుండా ఇంకా వెయ్యి అద్దె బస్సులు, 3వేల విద్యుత్ బస్సులు ప్రైవేటు సంస్థల ద్వారా తీసుకోవటాన్ని నిలిపివేయాలని, ఆ బస్సులన్నీ ఆర్టీసి ద్వారానే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం విద్యుత్ బస్సులకిచ్చే సబ్సిడీని ఆర్టీసిలకే నేరుగా ఇచ్చి ఆర్టీసిల ద్వారానే విద్యుత్ బస్సులు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు సంస్థలకివ్వటం, దొడ్డిదారి ప్రైవేటీకరణ అని అన్నారు. ఫెడరేషన్ జిల్లా కమిటీ కార్యదర్శి టివిజి రవిశంకర్ మాట్లాడుతూ 2017 నుండి బకాయి ఉన్న లీవు ఎన్‌క్యాష్‌మెంట్ ఇవ్వాలని, 2022 లీవు ఎన్‌క్యాష్ మెంట్‌కు అనుమతి ఇవ్వాలని, ఎస్‌బిటి, ఎస్‌ఆర్‌బిఎస్ బకాయిలు చెల్లించాలని కోరారు. కొత్త వేతన సవరణ కాని 2వేల మందికి వేతన సవరణ చేయాలని, అలవెన్స్‌లు, మెడికల్ లీవులు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గుంటూరు-1 డిపో నాయకులు యంవిఎస్ రామకృష్ణ, వియంఎస్ రావు, జిఆర్‌కె రావు, గుంటూరు-2 డిపో నాయకులు ఆర్‌ఎస్ రావు, జి.నవీన్‌కుమార్‌పాల్గొన్నారు.



మంగళగిరిలో



గుంటూరులో

ప్రజాశక్తి - మంగళగిరి : ఏపీఎస్‌ఆర్టీసీలో ప్రభుత్వం అద్దె బస్సులు తీసుకోవడాన్ని నిలిపివేయాలని కోరుతూ ఎస్ డబ్ల్యూ ఎఫ్ డిపో కమిటీ ఆధ్వర్యంలో మంగళగిరి ఆర్టీసీ బస్టాండ్ లో నిరసన వ్యక్తం చేశారు. అద్దె బస్సులతో పెద్ద ఎత్తున సాగుతున్న సమస్త ప్రైవేటీకరణ చర్యలను ఆపాలని సిఐటియు జిల్లా కార్యదర్శి జే వి రాఘవులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం డిఎం కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి వై కమలాకర్, డివైఎఫ్ఐ నాయకులు ఎస్ గణేష్, సిఐటియు నాయకులు టి శ్రీనివాసరావు, షేక్ జానీ భాష, ఎస్డబ్ల్యూఎఫ్ డిపో నాయకులు కే పాములు, పి ఎస్ రావు పాల్గొన్నారు.



జ్వరాల బారినపడకుండా అవగాహన

ప్రజాశక్తి - యడ్లపాడు

యడ్లపాడులో జరుగుతున్న 'ఫ్రైడే- డ్రైడే' కార్యక్రమంలో భాగంగా పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి జి.శోభారాణి, జిల్లా మలేరియా అధికారి కె.రవీంద్ర రత్నాకర్ సందర్శించారు. దోమల వలన కలిగే మలేరియా, డెంగీ జ్వరాలు రాకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. నీటినిల్వలు లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమతెరలు ఉపయోగించుకోవాలని, మురుగునీటి కాల్వల్లో నీరు నిల్వలు లేకుండా ఉండాలని సూచించారు. గతంలో మలేరియా జ్వరం బారిన పడ్డ విద్యార్థిని కొడిరెక్క మధుప్రియ అరోగ్య పరిస్థితి గురించి వాకబు చేశారు. కార్యక్రమంలో యడ్లపాడు పిహెచ్‌సి సూపర్‌వైజర్లు వి.రాజశేఖర్, ఎన్.పెర్సి, ఎఎన్‌ఎం పి.పార్వతి, వెంకటేశ్వర్లు, చిలకలూరిపేట మలేరియా అధికారి నారాయణ, మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

జై భీమ్ భారత్ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా విజయ్‌కుమార్

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్



జైభీమ్ భారత్ పార్టీ సత్తెనపల్లి నియో జకవర్గ ఇన్‌ఛార్జిగా పట్టణానికి చెందిన న్యాయవాది, పాత్రికేయులు జొన్నలగడ్డ విజయ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ అధ్యక్షులు, మాజీ న్యాయమూర్తి, హైకోర్టు అడ్వకేట్ జడ శ్రావణ్ కుమార్ నుంచి నియామక ఉత్తర్వులు అం దుకున్నారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు, నాయకులు ఆయనకు అభినందనలు తెలి పారు. విలేకరులతో విజయ్‌కుమార్ మాట్లాడుతూ బహు జనులకు ఆర్థిక, సామాజిక, రాజకీయ సమానత్వం రావా లంటే కేవలం రాజ్యాధికారం ద్వారానే సాధ్యమౌతుందన్నారు. బహుజనులు ఏకం కావాలని పిలుపు నిచ్చారు. త్వరలో పట్టణ, మండ లం, నియోజకవర్గ కమిటీలు ఏర్పాటు చేస్తా నని చెప్పారు. తనకు నియామకానికి కృషి చేసిన పల్నాడు జిల్లా అధ్యక్షులు గోదా జాన్ పాల్ తదితరులకు ధన్యవాదాలు తెలిపారు.



'లింగ వివ క్షతకు ఇక ముగింపు'

ప్రజాశక్తి - యడ్లపాడు

యడ్లపాడు మండల సమాఖ్య ఆధ్వర్యంలో 'లింగ వివక్షతకు ఇక ముగింపు' కార్యక్రమానికి మండల పరిషత్ అధ్యక్షురాలు పి.ఝాన్సీ సాగర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 'మహిళలపై హింస నిర్మూలన కోసం అంతర్జాతీయ దినోత్సవం' కార్యక్రమంలో సిడిపిఒ శాంతకుమారి, ఎంపిడిఒ వై. హనుమరెడ్డి, ఎజిఎం స్త్రీ నిధి చెన్నకేశవులు, మండల సమాఖ్య ప్రతి నిధులు, వివోఏలు, సిసిలు, స్త్రీనిధి మేనేజర్ శ్రీనివాసరావు, ఎపిఎం జీవన్ ఫీల్డ్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది, ఇఓపిఆర్‌డి, పోలీసు శాఖ, ఎంఈఓ శ్రీనివాస్, సెంట్ ఆన్స్ స్కూల్ విద్యార్థులు హాజరయ్యారు. స్త్రీలు , పురుషులు జెండర్ ప్రతిజ్ఞ వేరువేరుగా చేశారు. ర్యాలీ నిర్వహించారు. అదేవిధంగా, శుక్రవారం రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాన్ని సెయింట్ ఆన్స్ స్కూల్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ, ఎంపిపి పాల్గొన్నారు. పిల్లలకు గృహం నుండే వారికి సక్రమమైన మార్గాన్ని వారికి నిర్దేశించిన యెడల మంచి మార్గంలో నడవగలరని అన్నారు.

మహిళలపై హింసను పారద్రోలండి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

విశ్వ వ్యాప్తంగా మహిళలు, బాలికలపై జరుగుతున్న హింసను పార ద్రోలేందుకు నవంబరు 25 నుంచి డిసెంబరు 10 వరకు సమాజ చైతన్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో మహిళలపై జరుగుతున్న హింస నిర్మూలన దినోత్సవ కార్యక్రమాలను 15 రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా కలెక్టరేట్ నుంచి వై.ఎస్.ఆర్ ప్రభుత్వ వైద్య శాల వరకు ఐ.సి.డి.ఎస్, అంగన్ వాడీ, మహిళా పోలీస్ శాఖల మహిళలు శుక్ర వారం సాయంత్రం భారీ ర్యాలీ నిర్వ హించారు. ఈ ర్యాలీకి జెసి జెండా ఊపి ప్రారం భించారు. మహిళలు కొవ్వొత్తులతో ర్యాలీ లో పాల్గొన్నారు. మానవ హారం నిర్వహించారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం డిసెంబరు వరకు అన్ని ప్రాంతాల్లో పలు మహిళా చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని భారత మహిళా శిశు సంక్షేమ శాఖ కు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలను జారీ చేసిన నట్లు తెలిపారు. పలు రూపాల్లో మహి ళలపై జరిగే హింస, వివక్ష ను పారద్రోలడం తో పాటు మానవ హక్కులు మహిళలకు వర్తించేలా మన సమాజం మార్పు చెం దాలనే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మహిళలు, బాలి కలకు ఉన్న సంక్షేమ పథకాలు, న్యాయ బద్ధంగా ఉన్న చట్టాలను విస్తృతంగా ప్రచా రం చేయాలన్నారు. వరకట్నం, లైంగిక, గృహ హింస, మహిళలను అసభ్యకరంగా చూపించడం వంటి వేధింపులు, బాలికలు, చిన్నారుల అందరి సంరక్షణ కోసం అవసరమైన చట్టాల కోసం సమీక్షలు చేయాలన్నారు. వారి అవసరాలకు తగిన విధంగా అందుబాటులో ఉన్న హెల్ప్ లైన్ నంబర్లను ప్రజలకు తెలియజేయాలన్నారు. మహిళా పునరావాస కేంద్రాలు ఉజ్వల, స్వధార్ హెల్ప్ లైన్ నంబర్లపై ప్రతి మండలంలో ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలని మెరుగైన సమాజం కోసం కృషి చేయాలని కోరారు. న్యాయ వ్యవస్థ,పోలీసు, వైద్య విభా గాలలో మహిళల గౌరవానికి ఇబ్బంది లేకుండా వారి ప్రవర్తనలో మార్పులు తీసు కు వచ్చే కార్యక్రమాలు చేపట్టాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు పల్నాడు జిల్లాలో చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న మహిళా శిశు సంక్షేమ పథకాల అమలు, జరుగుతున్న హింసను పారద్రోలడానికి కృషి చేయాలని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఇన్‌ఛార్జ్ ప్రాజెక్ట్ అధికారి అరుణ పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, వినుకొండ సి.డి.పి.ఓ ఎం.అనురాధ, నరసరావు పేట సి.డి.పి.ఓ ఉమామహేశ్వరి, నాదెండ్ల సి.డి.పి.ఓ శాంత కుమారి, అంగాన్ వాడీ టీచర్లు, మహిళా పోలీస్ శాఖ పాల్గొన్నారు.



నరసరావుపేటలో కొవ్వొత్తులతో నిర్వహించిన ర్యాలీలో జెసి శ్యామ్‌ప్రసాద్ తదితరులు

'కాఫీ విత్ క్లాప్ మిత్ర'పై స్పందన తెలుసుకున్న కలెక్టర్



ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ప్రతి శుక్రవారం స్పెషల్ ఆఫీసర్ డే సందర్భంగా నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌లో తొలిసారిగా శుక్రవారం నిర్వహించిన కాఫీ విత్ క్లాప్ మిత్ర కార్యక్రమంలో చేపట్టిన కార్యక్రమాలపై స్పందనను తెలుసుకునేందుకు జిల్లా కలెక్టర్ శివశంకర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నకరికల్లు మండల రెవెన్యూ అధికారి కార్యా లయం నుండి మండల అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ప్రధానోపాధ్యాయులు అసిస్టెంట్ ఇంజనీర్లు తదితరులతో ఈ కాన్ఫరెన్స్ నిర్వహించారు. 'కాఫీ విత్ క్లాప్ మిత్ర' నిర్వహించిన తీరును అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలు, తీసుకోవాల్సిన చర్యలపై మండలాల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి క్లాప్ మిత్రలలో ఆత్మస్థైర్యం నింపే విధంగా తీసుకోవాల్సిన చర్యల గురించి సూచనలను స్వీకరించారు. అనంతరం నిక్షయమిత్ర రిజిస్ట్రేషన్, హౌసింగ్, జగనన్న స్వచ్ఛ సంకల్పం , చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలపై వివరాలు సేకరించారు. సమావేశంలో నకరికల్లు మండల ప్రత్యేక అధికారి వరలక్ష్మి, మండల రెవెన్యూ అధికారి సురేష్ పాల్గొన్నారు.



కనీస పనికి కనీస వేతనం ఇవ్వాలి

ప్రజాశక్తి - వినుకొండ

మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ ఇంజనీరింగ్ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు కనీస పనికి కనీస వేతనం ఇవ్వాలని మున్సిపల్ ఆఫీసు ముందు గేటు మీటింగ్ వేశారు. ఈ మీటింగ్ ను ఉద్దేశించి ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు మాట్లాడుతూ మున్సిపాలిటీలలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ కార్మిక సంఘాలకు, అనుబంధ కార్మిక సంఘాలకు రూ.15 వేలు మాత్రమే ఇస్తున్నారని, సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ 6, 7, 8 తేదీలలో ఒంగోలులో మున్సిపల్ వర్కర్స్ రాష్ట్ర మహాసభలు జరగ నున్నట్లు చెప్పారు. ఆ మహాసభలలో చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ఏఐటీయూసీ నాయకులు కె. సుభాని, ఆర్. వందనం, మల్లికార్జునరావు, మున్సిపల్ కార్మికులు నాగరాజు, నాగూరు శ్రీను, స్వామి, మస్తాన్ పాల్గొన్నారు

నరసరావుపేట 2వ పట్టణ సిఐగా వీరేంద్రబాబు

ప్రజాశక్తి- నరసరావుపేట



నరసరావుపేట 2వ పట్టణ సి.ఐగా వీరేంద్రబాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డిని, అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డిని మర్యాదపూర్వకంగా ఆయన కలిశారు. తుళ్లూరు ట్రాఫిక్ విభాగంలో పని చేస్తున్న వీరేంద్రబాబు సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం వీరేంద్రబాబు మాట్లాడుతూ ప్రజలకు భరోసా కల్పించే విధంగా సమర్ధవంతంగా విధులు నిర్వహిస్తానని, శాంతి భద్రతలను నెలకొల్పేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

105 ఏళ్ల వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి - పెదకూరపాడు



నూట ఐదేళ్లు నిండిన వృద్ధురాలు ఏలూరి లక్ష్మీబాయమ్మ శుక్రవారం మృతి చెందింది. మండలంలోని జలాల్పురం గ్రామానికి చెందిన లక్ష్మీబాయమ్మ వ్యవ సాయ కుటుంబ నేపథ్యం. ఆమెకు కుమారుడు కోటేశ్వరరావు ఉన్నాడు. వందేళ్లు దాటినా ఆరోగ్యంగా ఉండేదని, తన పని తాను చేసుకునేదని ఆయన వివరించారు. శారీర శ్రమ ,ఆరోగ్య నియమాలు పాటించడమే దీర్ఘకాలం జీవించడానికి కారణమని తెలిపారు.



మహాస్తూపాన్ని సందర్శించిన బౌద్ధ సమాఖ్య

ప్రజాశక్తి - అమరావతి

భూటాన్ లోని 24 జిల్లాలకు సంబంధించిన అంతర్జాతీయ బౌద్ధ సమాఖ్య ఉన్నతస్థాయి సభ్యుల బృందం తమ ఎనిమిదిరోజుల బౌద్ధ మత పవిత్ర స్థలాల సందర్శనలో భాగంగా శుక్రవారం అమరావతి మ్యూజియం, మహాస్తూపంను సందర్శించారు . వారికి మ్యూజియం అసిస్టెంట్ ఆర్కియాలజీ సూర్య ప్రకాష్, మ్యూజియం విశేషాలను, చరిత్ర గురించి వివరించారు. అనంతరం వారు మహాస్తూపాన్ని దర్శించి పూజా కార్యక్రమాలు నిర్వహిం చారు. భారత పురావస్తు శాఖ అధికారి, కన్జర్వేషన్ అసిస్టెంట్ నవీన్ కుమార్, మ్యూజియం సిబ్బంది చిన్నబాబు, శ్రీకాంత్, తెలుగురాష్ట్రాల పోలీసు, టూరిజం శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కలాం జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

ప్రజాశక్తి - అమరావతి

మండల కేంద్రమైన అమరావతిలోని పురాతన శ్రీ రామకృష్ణా హిందూ హైస్కూల్‌లో శుక్రవారం సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తహ శీల్దార్ విజయ్‌శ్రీ ప్రారంభించారు అనం తరం విద్యార్థిని విద్యార్థులు ఏర్పాటు చేసు కున్న సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకించారు పాఠశాల విద్యార్థిని ఎస్.కె సుశీల బేగం పదవ తరగతి విద్యార్థిని ఏర్పాటు చేసిన పేషెంట్ హెల్త్ మానిటరింగ్ చేశారు. అతి కొద్ది చిన్నపాటి పరికరాలతో సొంతంగా సైన్స్ మాస్టర్ సలహాలతో హార్ట్ బీట్ పెరి గిన ఈపల్స్ రేటు పెరిగిన డాక్టర్ కు ఇంటి మేషన్ చేసే విధంగా ఒక పరికరాన్ని అద్భుతంగా రూపొందించారు. తహ శీల్దారు విజయశ్రీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు అబ్దుల్ కలాం జీవితాన్ని ఆద ర్శంగా తీసు కోవాలని సూచించారు.



అమరావతిలోని శ్రీ రామకృష్ణా హిందూ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న సైన్స్ ఫెయిర్

మండల అభివృద్ధి అధికారి పిన్నింటి మాధురి మాట్లాడుతూ భావిభారత పౌరులుగా, భావి భారత శాస్త్ర వేత్తలుగా కనిపిస్తున్నారని విద్యార్థుల నుద్దే శించి అన్నారు. ఎంఈఓ శ్రీనివాస రావు, శ్రీ రామకృష్ణా హిందూ హైస్కూల్ కరస్పాండెంట్ వి.శేఖర్‌బాబు కార్యదర్శి పి.సత్య నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి రూరల్: సైన్స్ గణితం పట్ల ఆసక్తి కలిగివుండాలని ఇన్‌ఛార్జి ప్రధానో పాధ్యాయురాలు జి.శివకుమారి విజ్ఞప్తి చేశారు. ఫణిదం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల స్థాయి సైన్స్ ఎగ్జి బిషన్ నిర్వహించారు. ఐదు ఇతివృత్తాలపై విద్యార్థులు 65 ఆవిష్కరణ లను ప్రదర్శించారు. విజేతలకు బహు మతులు అంద జేశారు. సర్పంచ్ వి.బుల్లిబాబు, ఉపా ధ్యాయులు పాల్గొన్నారు. **ముప్పాళ్ల:** మండలంలోని దమ్మాలపాడులోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో సైన్స్ ఫెయిర్ నిర్వహించారు పాఠశాల విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల సైన్స్ ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. ప్రాజెక్టులలో ప్రతిభ కనబర్చిన కుమ్మర ప్రవీణ్ కుమార్, కొరబండి ఎబినేజర్,గనుపల్లి సౌమ్య, కొరబండి షాలోమ్,బోగాల మనోహర్ రెడ్డి,నాగినీడి అనుష్క, తాటిపర్తి హిమలతాశ్రీ,కంభాల అనురాధల ప్రాజెక్టులను మండల స్థాయికి ఎంపిక చేసినట్లు ప్రధానోపాధ్యాయురాలు మరియమ్మ తెలిపారు. మండల స్పెషల్ ఆఫీసర్ సుధాకర్, ఈవోపిఆర్డీ రూపావతి, ఎపిఎమ్ బాలస్వామి, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



మంగళగిరిలో మాన్విక్ హ్యాండీ క్రాఫ్ట్స్ గిఫ్ట్ షాప్

ప్రజాశక్తి - మంగళగిరి



మంగళగిరి పట్టణంలోని తెనాలి రోడ్ లో హ్యాండీక్రాఫ్ట్స్ గిఫ్ట్ ఆర్టికల్ షాపులో అన్ని రకాల గిఫ్ట్ ఆర్టికల్స్ లభిస్తాయని ఆర్టికల్ షాప్ యజమాని గుర్రం భాగ్యరాజు తెలిపారు. గుంటూరు, విజయవాడ నగరాల్లో ఉన్న షాపుల కన్నా సరసమైన ధరలకు అందుబాటులో గిఫ్ట్ ఆర్టికల్స్ ఉన్నాయని తెలిపారు. శాలువాలు, బ్యాడ్జీలు, అదేవిధంగా రాజకీయ పార్టీల సింబల్ బ్యాడ్జీలు, పూజా సామాగ్రి, లభిస్తాయి అని తెలిపారు. గన్, జింక్ మెటల్ ఐటమ్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. దేవుడు విగ్రహాలు, గెలుపొందిన క్రీడాకారులకు అందజేసే అన్ని రకాల షీల్డ్‌లు ఉన్నాయని తెలిపారు. మంగళగిరి పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని భాగ్యరాజు కోరారు. గత కొన్ని సంవత్సరాలుగా మంగళగిరిలో ఈ షాపును ఏర్పాటు చేసి అమ్మకాలు చేస్తున్నట్లుగా తెలిపారు.

రోగ నిర్ధారణకు స్కానింగ్ అనివార్యం

- 'అడగండి' చర్చా వేదికలో డాక్టర్ మహ్మద్ రియాజ్‌ఖాన్

ప్రజాశక్తి-తెనాలి

సమాజిక రుగ్మతలపై ప్రజలకు వివరించేందుకు చేపట్టిన అడగండి.. చెబుతాం ... చర్చావేదిక గురువారం స్థానిక ఆలపాటినగర్‌లోని రత్నా ఫార్చ్యూన్ కల్యాణ మండపంలో జరిగింది. 'స్కానింగ్-ప్లానింగ్' అంశంపై నిర్వహించిన చర్చావేదికకు నిర్వాహకులు దిలీప్ రాజా సంధాన కర్తగా వ్యవహరించారు. చర్చలో పట్టణానికి చెందిన ప్రముఖ రేడియాలజిస్ట్ డాక్టర్ మహ్మద్ రియాజ్‌ఖాన్ పాల్గొని మాట్లాడారు. అల్ట్రా సౌండ్ స్కానింగ్, ఎమ్మారై స్కానింగ్‌లో రేడియేషన్ ఉండద న్నారు. గర్భిణీలకు ఎక్స్‌రేలు, ఎమ్మారై స్కానింగ్ చేయరా దన్నారు. రోగి ఆరోగ్యస్థితిని అంచనా వేసే క్రమంలో వివిధ రకాల పరీక్షల్లో స్కానింగ్ ప్రధానమైందన్నారు. అనవసరంగా స్కానింగ్ రాస్తున్నారంటూ కొందరు చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఎమ్మారై స్కానింగ్ నిపుణులు షేక్ ఖాదర్ భాషా మాట్లాడుతూ సొరంగం లాంటి యంత్రంలోకి మనిషిని పంపి ఎమ్మారై స్కానింగ్ చేయటంపై రోగులు భయపడుతున్నార న్నారని, అయితే ప్రస్తుతం రోగిలో భయాన్ని తొలగించేందుకు కొత్త ప్రయోగాలు జరుగుతున్నాయన్నారు. గుంటూరు జీజీహెచ్ పాథాలజిస్ట్ డాక్టర్ భరత్ మాట్లాడుతూ మహిళల్లో వచ్చే గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ నిర్ధారణలో స్కానింగ్ ప్రక్రియ చాల ప్రధానమన్నారు. కార్యక్రమంలో కొక్కిలిగడ్డ కిరణ్, నాలాది ప్రభాకర్, ఎం.భానుప్రసాద్, జిఎఫ్ కిరణ్‌కుమార్, మొహిద్దీన్ భాషా, మిలిటరీ ప్రసాద్ పాల్గొన్నారు.



రేపు నాగార్జునలో మెగా నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

హోటల్ గ్రాండ్ నాగార్జున ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీ మెగా ఎంటర్టైన్మెంట్ మ్యాజికల్ నైట్ జరగనుందని హోటల్ గ్రాండ్ నాగార్జున మేనేజింగ్ డైరెక్టర్ అరవింద్ తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను మంత్రి ఆర్.కె.రోజా శుక్రవారం విజ్ఞాన మందిరంలో ఆవిష్కరించారు. ఎంపి లావు కృష్ణదేవరాయులతో పాటు పలువరు ప్రజా ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరవింద్ మీడియాతో మాట్లాడుతూ కరోనా వైరస్ విపత్తు కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని ఈ నేపథ్యంలో ప్రజలకు మంచి ఎంటర్టైన్మెంట్ ఇవ్వాలనే ఉద్దేశంతో హెూటల్ గ్రాండ్ నాగార్జునలో ఆదివారం సాయంత్రం 06:00 గంటల నుండి రాత్రి 10:30 నిమిషాల వరకు వివిధ సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి బిగ్ బాస్ సెలబ్రిటీస్, జబర్దస్త్ టీం, ఢీ డ్యాన్సర్స్, ఐడియాల్ సింగర్స్, పల్సర్ బైక్ ఝాన్సీ టీం, పలువురు నటీ నటులు రానున్నట్లు తెలిపారు. మీడియా సమావేశంలో నల్క, నాగేశ్వరరావు, శివ నారాయణ, శర్మ, కళ్యాణ్, కరీం తదితరులు పాల్గొన్నారు.

సమాజం మహిళలకు రక్షణగా నిలవాలి

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్: మహిళలపై హింసను నిరోధించడానికి కఠిన శిక్షలు వేగంగా పడేవిధంగా దిశ బిల్ ఏపీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రూపొందించారని, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ అన్నారు. నవంబర్ 25 మహిళలపై హింస నివారణ అంతర్జాతీయ దినంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించిన నేపథ్యంలో మంగళగిరి కార్యాలయంలో వాసిరెడ్డి పద్మ మీడియాతో మాట్లాడారు. సన్నిహితుల నుంచే మహిళలపై హింస ఎక్కువగా జరగడం ప్రపంచవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్న విషయమని ఐక్యరాజ్యసమితి పేర్కొనడం జరిగిందన్నారు. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే-5 నివేదిక ప్రకారం దేశంలోని ప్రతి ముగ్గురు స్త్రీలలో ఒకరు వారి భర్తల నుంచి శారీరక, లైంగిక, హింస ఎదుర్కొంటున్నట్లు వెల్లడైందన్నారు. మహిళల చుట్ట ఉన్న ప్రపంచాన్ని, కుటుంబం, సమాజం మార్చకుండా మహిళలపై హింసను ఆపలేమన్నారు. సమాజం మహిళలకు రక్షణ కవచంగా మారే చైతన్యం ఉండాలన్నారు. సంక్షేమ పథకాలలో మహిళలకు ప్రాధాన్యత, 50 శాతం రిజర్వేషన్లు అమలు, 30 లక్షల మందికి ఇళ్ల పట్టాల పంపిణీ చేయడం జరిగిందన్నారు. చారిత్రాత్మక నిర్ణయాలతో మహిళలకు ఇంట, బయట కీలకమైన వ్యక్తులుగా సమాజంలో గుర్తింపు వచ్చే విధంగా సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు.

ప్రజాశక్తి-తెనాలి: మహిళలపై హింస వివక్షతకు వ్యతిరేకంగా పట్టణంలో ఐసిడిఎస్ ఆధ్వర్యలో ర్యాలీ నిర్వహించారు. సిడిపివో గీతాంజలి సారధ్యంలో నిర్వహించిన ర్యాలీ కొత్తపేట ఎంపీడివో కార్యాలయం నుంచి ప్రారంభమైంది. ర్యాలీలో మహిళల రక్షణ-మనందరి బాధ్యత, అత్యాచారం-అమానుషం, మహిళలపై హింసను అరికట్టండి అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడిఓ ఎల్ విజయాలక్ష్మణ్, ఈవోపిఆర్‌డి కెపి ప్రభాకర్, సూపరింటెండెంట్



ప్రతాప్‌రెడ్డి, ఏపిఎం కె.జయశ్రీ, అంగన్‌వాడి సూపర్‌వైజర్లు ఎం.సుచిత్ర, కె.సౌజన్య, సిహెచ్ హిమబిందు పాల్గొన్నారు. **ప్రజాశక్తి - దుగ్గిరాల:** మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు నివారించేందుకు ప్రభుత్వం వివిధ రకాల పథకాలు చేపట్టినట్లు సి డిపి ఓ వై నూర్ రాణి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నవంబర్ 25వ తేదీ నుండి డిసెంబర్ 10వ తేదీ వరకు 16 రోజులపాటు మానవ హక్కుల దినోత్సవం ప్రచార కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం మహాలక్ష్మి ఎం ఈ ఓ కాజ శ్రీనివాసరావు అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు. **ప్రజాశక్తి - చేబ్రోలు:** అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినం సందర్భంగా డాక్టర్ వైయస్సార్ క్రాంతి పథం ఏపీఎం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో చేబ్రోలు మండల పరిషత్ కార్యాలయము నుండి మెయిన్ రోడ్డు లో చేబ్రోలు ప్రధాన కేంద్రం వరకు మహిళలు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి బాబురావు మాట్లాడుతూ మహిళలకు సంబంధించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక మహిళా రక్షణ చట్టాలు తీసుకురావడం జరిగింది అన్నారు. ఆడబిడ్డ పుట్టుక గురించి సమాజంలో జరుగుతున్న అనేక అక్రమాలకు ప్రభుత్వం చెక్ పెట్టిందని, బాల్య వివాహాలు చాలా వరకూ నిషేధించటం జరిగిందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వైయస్సార్ క్రాంతి పదం సిబ్బంది, డ్వాక్రా గ్రూపు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

జెవివి ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ దినోత్సవం

ప్రజాశక్తి - పెదనందిపాడు



భారత రాజ్యాంగం ద్వారానే భారతదేశం ప్రపంచ దేశాలలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా వర్ధిల్లుతున్నదని, రాజ్యాంగం ద్వారానే ప్రజాస్వామ్యానికి రక్షణ అని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కోట వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. 26వ తేదీ రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా శుక్రవారం అప్పాపురం గ్రామంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద రాజ్యాంగ దినోత్సవాన్ని ప్రధానోపాధ్యాయులు గేరా మోహనరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం గేరా మోహనరావు మాట్లాడుతూ విద్యార్థులలో ప్రాథమిక స్థాయి నుండి దేశభక్తి, ప్రజాస్వామ్యం, సామాజిక స్పృహ, లౌకిక భావాలు, సమసమాజ నిర్మాణం, శాస్త్రీయ ఆలోచన, గణతంత్ర రాజ్యం, సామాజిక న్యాయం, సామాజిక సంస్కరణలు, నైతిక విలువలు తదితర అంశాలపై పూర్తి అవగాహన కలుగచేయాలని అంబేద్కర్ విగ్రహం వద్దకు విద్యార్థులను తీసుకువచ్చి అవగాహన కల్పించా మన్నారు. విద్యార్థులు అంబేద్కర్ జీవితాన్ని ఆదర్శం గా తీసుకొని నైతిక విలువలతో జీవించాలని, సమ సమాజ స్థాపనకు తోడ్పడాలని సూచించారు.

డ్రోన్ కెమెరాలతో సర్వే

ప్రజాశక్తి - ప్రత్తిపాడు : జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష సర్వే రైతుల సమక్షంలోనే జరగాలని ఎపి ప్రభుత్వ ఐటి సలహాదారులు టి శశిరెడ్డి తెలిపారు. మండలంలోని కొండేపాడు గ్రామంలో శుక్రవారం సర్వే ప్రారంభించారు. ఈ సందర్భంగా శశిరెడ్డి డ్రోన్ సర్వేలో వివరాలను పరిశీలించి, అధికారులతో, రైతులతో మాట్లాడారు. గ్రామస్థాయిలో ఇంటర్నెట్ సమస్య ఎక్కువగా ఉంటుందని సర్వే ప్రక్రియ కూడా లేట్ అవుతుందని ప్రత్తిపాడు తహసిల్దార్ సంజయ్ కుమారి తెలి పారు.

వైసిపి మైనార్టీ వెల్ఫేర్ సభ్యులుగా షేక్ సైపుల్లా

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్ : వైసిపి మైనార్టీ వెల్ఫేర్ సభ్యులుగా షేక్ సైపుల్లా నియమితులయ్యారు. ఆయన తండ్రి మైనారీ వెల్ఫేర్ ఛైర్మన్ షేక్ యాసిన్ ఇటీవల మరణించారు. ఈ క్రమంలో ఆయన కుమారుడైన షేక్ సైపుల్ల ను మైనార్టీ వెల్ఫేర్ సభ్యులుగా షేక్ సైపుల్లను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా షేక్ పైపుల్లాను పలువురు అభిమానులు కార్యకర్తలు పూలమాలలతో ఘనంగా సత్కరించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కిలారి రోశయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి - తుళ్లూరు : డొక్కామాణిక్య వరప్రసాద్‌కు గుంటూరు జిల్లా వైసిపి అధ్యక్ష పదవి కట్టబెట్టి నందుకు కతజ్ఞతగా ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు సిఎం జగన్ మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. శుక్రవారం స్థానిక బి ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద జగన్ మోహన్ రెడ్డి థాంక్యూ సిఎం సార్.. అంటూ తమ ఆనందాన్ని వెలిబుచ్చారు. వైసిపి నాయకులు తోకల నాగేశ్వరావు, మరికొంత మంది నాయకులు మాట్లాడుతూ, మాణిక్య వరప్రసాద్ అనుభవం పార్టీ అభివద్ధికి దోహదపడుతుందని అన్నారు. కార్యక్రమంలో గాదె నాగేశ్వరరావు, సుంకర శ్రీనివాసరావు, భోగినేని అప్పారావు, కొప్పుల శేషగిరిరావు, మేరిగ తిరుపతిరావు, కంతేటి చిన్న వెంకటేశ్వర్లు, ఎ రాజేష్, ఎ కనకారావు, బండి స్టాలిన్, కొప్పుల శేషగిరిరావు, డాక్టర్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా బి ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.



భవన నిర్మాణ కార్మికుడు మృతి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని గుండి మెడ గ్రామానికి చెందిన జెట్టి ప్రకాష (38) శుక్రవారం ఉదయం ఉదయం గుండె పోటు తో మృతి చెందాడు. వత్తి రీత్యా పెయింటర్ అయిన ప్రకాష్ ఎప్పటి లాగే విజయవాడ పెయింట్ పనికి వెళ్ళాడు. ఒక్కసారిగా ఛాతీ నొప్పి రావటం, వాంతులు కావడంతో విజయవాడ లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. వైద్యులు చికిత్స చేస్తుండగా గుండెపోటుకు గురై మతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రకాష్ మతి వార్త తెలుసుకున్న సి పి ఎం తాడేపల్లి మండల నాయకులు పల్లె కష్ణ, బత్తుల సంసోన్, కెవిపిఎష్ మండల నాయకులు దాసరి అజయ్ , జే అనిల్ ప్రకాష్ మత దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

సంక్షేమ వసతిగృహాల్లో

సౌకర్యాలను మెరుగు పరచాలి

ప్రజాశక్తి-తెనాలి:

పేద విద్యార్థులు తలదాచుకునే సంక్షేమ వసతి గృహాల్లో సౌకర్యాలు మెరుగుపరచాలని తెలుగు విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు మన్నవ వంశీకృష్ణ అన్నారు. సంక్షేమ హాస్టళ్ళ పోరుబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాత్రి స్థానిక ఎస్సీ, ఎస్టీ బాలుర వసతి గృహాలను పరిశీలించారు. మెను ప్రకారం భోజనం, వసతి గృహాల్లో సౌకర్యాలు వంటివి పరిశీలించారు. విద్యార్థుల ద్వారా వివరాలు తెలుసుకున్నారు. అక్కడే ఉన్న వసతిగృహ సంక్షేమాధికారిణితో మాట్లాడారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ వసతిగృహాల్లో విద్యార్థులకు సన్నబియ్యంతో భోజనం పెట్టాలన్నారు. అలాగే శిధిలావస్థలో ఉన్న హాస్టళ్ళకు భవన నిర్మాణాలు చేపట్టాలన్నారు. మెనూ అమలుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వసతి గృహాల్లో నాల్గవ తరగతి ఉద్యోగుల కాళీలను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గుమ్మడి భార్గవ్, నరేంద్రసాయి, అజయ్, అఖిల్, శివ, భార్గవ, నరవింహ, నాగసాయి, దిలీప్, శ్రీను పాల్గొన్నారు.



అత్యాచార నిందితుడిని తక్షణం అరెస్ట్ చేయండి

మందకృష్ణ మాదిగ డిమాండ్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు నగరం విద్యానగర్‌లో 17 రోజుల క్రితం మాదిగ యువతి పై అత్యాచారం చేసిన సాంబయ్య చౌదరితో పాటు అతని కుటుంబ సభ్యులను అరెస్టు చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక బ్రాడీపేటలోని ఒక హోటల్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న అత్యాచార సంఘటనలపై దిశ చట్టాలు చేశామని గొప్పలు చెప్పుకుంటున్న రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దాన్ని సక్రమంగా అమలు చేయడంలో విఫలమవటం బాధాకరమన్నారు. నిందితుడు సాంబయ్యను అరెస్ట్ చేయకుండా మంత్రి విడదల రజిని మరిది అడ్డుపడుతున్నారన్నారు. బాధితులను బెదిరించడం, కేసును నీరుకారే విధంగా ప్రయత్నించడం ఎమ్మార్పీఎస్ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. రాష్ట్రంలో గత మూడున్నర సంవత్సరాలుగా ఇద్దరూ దళిత హోం మంత్రులు ఉన్నా దళితులపై, బలహీన వర్గాలపై అత్యాచారాలు, దాడులు, దౌర్జన్యాలు, కొనసాగుతుండటం ప్రభుత్వ ఆటవిక విధానాలకు అద్దం పడుతున్నాయని అన్నారు. అత్యాచార సంఘటనకు గురి అయిన బాధితురాలి వైద్య పరీక్షలు పూర్తిచేసి కేసు నమోదు చేసిన పోలీసులు తిరిగి ప్రతిరోజు వైద్య పరీక్షల పేరుతో కేసులు నీరు కార్చే విధంగా రోజు ప్రభుత్వాసుపత్రి చుట్టూ తిప్పుకోవడం దారుణం అన్నారు. సాంబయ్య చౌదరిని అరెస్ట్ చేసే వరకు బాధితురాలికి అన్ని విధాల న్యాయం జరిగే వరకూ ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అన్ని మండల కేంద్రాలలో రిలే నిరాహార దీక్షలు ధర్నాలు ద్వారా నిరసన తెలియజేస్తామని చెప్పారు. మహాజన సోషలిస్ట్ పార్టీ జాతీయ కన్వీనర్ ఊసురుపాటి బ్రహ్మయ్య, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు రుద్రపోగు సురేష్, ఉమ్మడి గుంటూరు జిల్లా వేమూరి సుధీర్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



దుకాణదారులతో మాట్లాడుతున్న శివశంకర్

అవగాహన లేకే ఫ్యాషన్‌గా..

- ధూమపానంతో ఆరోగ్యానికి ఎంతో అనర్థం
- బహిరంగ ప్రాంతాల్లో ధూమపానానికి రూ.200 జరిమానా

ప్రజాశక్తి - నరసరావుపేట

ధూమపానం వలన కలిగే అనర్థాలపై అవగాహన లేకపోవడం వల్ల యువత దీన్ని ఫ్యాషన్‌గా భావిస్తున్నారని బహిరంగ ధూమపానం నిషేధం కమిటీ రాష్ట్ర న్యాయ సలహాదారుడు శివశంకర్ అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో శుక్రవారం బహిరంగ ధూమపానంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించడంతోపాటు ముఖ్యప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ ధూమపానం అనారోగ్యానికి దారి తీస్తుందని, ధూమపానం చేసేవారితో పాటు తోటివారికీ అది ప్రమాదకరమని అన్నారు. అనర్థాలపై ప్రజలకు, ముఖ్యంగా యువతకు అవగాహన కోసం గోడపత్రికను ప్రతి దుకాణంలో ఏర్పాటు చేయాలని చెప్పారు. దుకాణాల వద్ద లేదా బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేస్తే రూ.200 జరిమానా విధించాలని పోలీసులకు సూచించారు. ధూమపానం వల్ల జరిగే నష్టాలు, ఆరోగ్యం పట్ల సూచికలున్న వాల్‌పోస్టర్లను ప్రతి వ్యాపారీ విస్తృతంగా ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు., పలు అంశాలపై ఏరియా వైద్యశాల డాక్టర్లు వివరించారు.

కామన్వెల్త్ క్రీడలకు కెఎల్ యు విద్యార్థిని సాదియా..



ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ : కెఎల్ విశ్వవిద్యాలయంలో బిఎ (ఐఎఎస్) 3వ సంవత్సరం విద్యార్థిని, అంతర్జాతీయ పవర్ లిఫ్టర్ సాదియా అల్‌మాన్.. కామన్వెల్త్ క్రీడలకు ఎంపికైనట్లు విశ్వవిద్యాలయం క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.హరికిషోర్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 27 నుండి డిసెంబరు 1 వరకు న్యూజిల్యాండులో నిర్వహించే కామన్వెల్త్ పోటీల్లో పాల్గొననున్న సాదియాకు విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్సలర్ డాక్టర్ జి.పార్థసారదివర్మ, ప్రో.వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎన్.వెంకటరామ్ అభినందనలు తెలిపారు. సాదియా కామన్వెల్త్ క్రీడల్లోనూ రాణించి దేశానికి, రాష్ట్రానికి విశ్వ విద్యాలయానికి మంచి పేరు ప్రతిష్టలు తేవాలని ఆకాంక్షించారు. సాదియాకు డీన్, విద్యార్థి సంక్షేమ విభాగ అధిపతి డాక్టర్ హనుమంతరావు, పీడీ డాక్టర్ కె.సుజాత, తదితరులు శుభాకాంక్షలు తెలిపి క్రీడలకు పంపించారు.



సమానత్వం కోసం సమిష్టి కృషి

ప్రజాశక్తి-గుంటూరు : సమానత్వంతో కూడిన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం అంతర్జాతీయ హింసా వ్యతిరేక దినం సందర్భంగా కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినులు ప్ల కార్డులు చేతబట్టి, స్త్రీలపై జరుగుతున్న దాడులకు నిరసనగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సెమినార్‌లో కళాశాల లేడీ అడ్వైజరీ అండ్ ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ కన్వీనర్ డాక్టర్ జి.సుధావాణి సమానత్వ సాధనకు తమవంతు కృషి చేయటానికి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. స్త్రీలపై దాడులను అరికట్టటానికి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ అన్నారు.

నటన, ముకాభినయం పోటీలు : ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజీలో క్లబ్ థియేట్రిక్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సందర్భోచిత నటన, ముకాభినయం పోటీలు నిర్వహించగా వీటిని కళాశాల సాంస్కృతిక విభాగాధిపతి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ పర్యవేక్షించారు. గెలుపొందిన వారికి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవీంద్ర, విభాగాధిపతులు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న మంత్రి రోజా తదితరులు

ఘనంగా ప్రారంభమైన క్రెడాయ్ ప్రాపర్టీ షో

హాజరైన మంత్రులు, ప్రజా ప్రతినిధులు

ప్రజాశక్తి-గుంటూరు

క్రెడాయ్ గుంటూరు ఛాప్టర్ ఆధ్వర్యంలో మూడ్రోజులపాటు నిర్వహించే 6వ మెగా ప్రాపర్టీ షో శుక్రవారం స్థానిక రింగు రోడ్డులోని, సిద్దార్థ గార్డెన్స్‌లో ప్రారంభమైంది. గుంటూరు ఛాప్టర్ అధ్యక్షులు మామిడి రాము అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర టూరిజం, స్పోర్ట్స్ అండ్ యూత్ అడ్వాన్స్‌మెంట్, కల్చరల్ శాఖ మంత్రి ఆర్.కె.రోజా ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇలాంటి ప్రాపర్టీ షో వల్ల ఇంటికి సంబంధించిన అన్ని అవసరమైన పరికరాలు ఒక్కచోట ఉండటంతో ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. కేవలం ఐదు రోజుల్లోనే బ్యాంకు రుణం మంజూరు చేస్తుందన్నారు. నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ క్రెడాయ్ చారిత్రాత్మకమైన సంస్థ అని, ఈ సంస్థ ఏర్పాటు చేసిన ప్రాపర్టీషోను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, నగర మేయర్ కావటి శివనాగమనోహర్‌నాయుడు, ఎమ్మెల్యేలు మద్దాళి గిరిధర్, ఉండవల్లి శ్రీదేవి, ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి తదితరులు మాట్లాడుతూ క్రెడాయ్ కృషిని అభినందించారు. క్రెడాయ్ స్టేట్ సెక్రెటరీ బోస్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఫ్లాట్స్, మెటీరియల్స్, బ్యాంకు లోన్లు అన్నీ ఒకేచోటకు తేవటం ఈ ప్రాపర్టీషో ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో క్రెడాయ్ స్టేట్ అడ్వైజరీ కమిటీ ఛైర్మన్ ఆళ్ల శివారెడ్డి, ఎస్‌బిఐ సర్కిల్ డిజిఎం దత్తావాడ్కర్, సతీష్‌రెడ్డి, వినోద్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉత్సాహంగా ప్రారంభమైన అంగన్‌వాడీ మహాసభ



మల్లు స్వరాజ్యం, రంజనా నిరులా చిత్ర పటాల వద్ద ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, సంఘం జాతీయ నాయకులు వరలక్ష్మి తదితరుల నివాళి

ప్రజాశక్తి-గుంటూరు

ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర 10వ మహాసభ శుక్రవారం స్థానిక రెవెన్యూ కళ్యాణ మండపంలో ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభమైంది. రెండ్రోజులపాటు జరిగే ఈ మహాసభకు 26 జిల్లాల నుండి వందలాది మంది ప్రతినిధులు హాజరయ్యారు. మహాసభ వేదికకు ఇటీవల మరణించిన యూనియన్ ఆలిండియా నాయకులు రంజనా నిరులా నగర్‌గా నామకరణం చేశారు. మహాసభల ప్రారంభ సూచికగా యూనియన్ జెండాను రాష్ట్ర అధ్యక్షులు బేబిరాణి ఆవిష్కరించారు. ప్రతినిధులు, నాయకులు యూనియన్ జెండాకు విప్లవ జేజేలు పలికారు. అనంతరం అమర వీరుల స్తూపానికి ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు నర్సింగరావు, అంగన్‌వాడీ యూనియన్ జాతీయ కార్యదర్శి కె.వరలక్ష్మి, రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన ప్రారంభ సభలో రంజనా నిరులా చిత్ర పటానికి యూనియన్ జాతీయ కార్యదర్శి వరలక్ష్మి, తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం చిత్రపటానికి ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ఇతర నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. మహాసభకు యూనియన్ నాయకులు బేబిరాణి, సుప్రజ, బి.లక్ష్మి, లక్ష్మిదేవి, అనసూయమ్మ అధ్యక్షవర్గంగా వ్యవహరించారు.

యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. గత మహాసభ నుండి నేటి వరకూ చేపట్టిన కార్యక్రమాలు, ప్రభుత్వ విధానాలు, యూనియన్ సాధించిన విజయాలను నివేదిక ద్వారా ప్రతిపాదించారు. కార్యదర్శి నివేదికపై ప్రతినిధులు చర్చించారు. ప్రొఫెసర్ ఎంవిఎస్ కోటేశ్వరరావు మెమోరియల్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు వివిధ అభ్యుదయ గీతాలకు చేసిన నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. మహాసభలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.లక్ష్మినారాయణ, వై.నేతాజి, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమాసుష్మ, దీప్తి మనోజ, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్ పాల్గొన్నారు.



అమరుల స్తూపానికి నివాళులర్పిస్తున్న సిహెచ్ నర్సింగరావు, రోజా తదితరులు



ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ప్రతినిధులు



ఎంవిఎస్ స్కూల్ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు



హాజరైన ప్రతినిధులు



జెండా ఆవిష్కరణ చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బేబిరాణి, పాల్గొన్న నాయకులు, ప్రతినిధులు



ప్రారంభ సభలో మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ, సౌహార్ద సందేశం ఇస్తున్న ఎస్.పుణ్యవతి, కె.ధనలక్ష్మి, డి.శ్రీనివాసకుమారి